
**విలేకరులు కావలెను**
'వజ్రభారతి' తెలుగు దినపత్రిక లో
ఆంధ్ర ప్రదేశ్ మరియు
తెలంగాణ రాష్ట్రాలలో
అన్ని జిల్లాలకు, మండలాలకు
నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు,
మండల విలేకరులు కావలెను.
98498 39560

Cell : 98498 39560
RNI.No : APTEL/2021/80994
Dare to Write... Dare to fight

# వజ్రభారతి

vajrabharathi@gmail.com
ఎడిటర్ :
పమ్మి ఏడుకొండలు
సామాజిక, రాజకీయ జాతీయ తెలుగు దినపత్రిక




సంపుటి : 5 సంచిక : 146 ఎడిటర్ : పి.ఏడుకొండలు వెల : 2 రూపాయిలు తేదీ: ఆదివారం 24-5-2026 పేజీలు : 8 E-mail:vajrabharathi@gmail.com



## 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

- పథకం రెండో విడత కింద మంజూరు..
- నియోజకవర్గానికి 2 వేల చొప్పున కేటాయింపు
- రాష్ట్రంలోని 14,800 పూరి గుడిసెల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు
- క్యూర్ ఏరియాలో లక్ష ఎల్ఐజీ,ఎంఐజీ ఇళ్ల నిర్మాణం
- ఎల్ఐజీ ఇళ్లకు రూ. 5 లక్షలతోపాటు అన్‌డివైడెడ్ షేర్ ఉచితం
- ఎంఐజీ లబ్ధిదారులకు స్వల్ప లాభంతో ఇళ్ల కేటాయింపు
- వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలకు రూ. 1,000 కోట్లు
- జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు
- రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు..

హైదరాబాద్: రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 2.5 లక్షల గృహాలు నిర్మించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఇందులో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లను కేటాయించింది. 2 వేల ఇళ్లలో 1,500 ఇళ్లను ప్రతి నియోజకవర్గంలో లబ్ధిదారులకు గతంలో ఇచ్చిన తరహాలోనే ఇళ్ల నిర్మాణం లెవల్‌నుబట్టి దశలవారీగా మొత్తం రూ. 5 లక్షలను ప్రభుత్వం

## వేద పాఠశాలకు భూమిపూజ

- యాదగిరిగుట్టలో రూ. 99.55 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన
- కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి సమక్షంలో కార్యక్రమం
- అనంతరం దైవదర్శనం చేసుకున్న సీఎం, మంత్రులు
- సీఎం టూర్‌లో ప్రొటోకాల్ వైఫల్యం.. వేరేచోట ల్యాండైన హెలికాప్టర్

2లో

## తెలంగాణలో ఐఏఎస్, డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు..

- తెలంగాణ రెవెన్యూ శాఖలో భారీ స్థాయిలో అధికారుల బదిలీలు
- స్టేషన్ ఘన్‌పూర్, పరకాల ఆర్‌డీఓ పోస్టుల్లో కీలక మార్పులు
- డెప్యుటేషన్‌పై పలువురు అధికారులకు కొత్త బాధ్యతలు
- తక్షణమే అమల్లోకి వచ్చిన ప్రభుత్వ తాజా ఉత్తర్వులు

2లో

## లండన్ వెళ్లొచ్చినా సైకో తత్వం పోలేదు

- రాజారెడ్డి రాజ్యాంగం, హత్యల చరిత్రను ప్రజలు మర్చిపోలేదన్న అనగాని
- గొడ్డలి పార్టీ అధ్యక్షుడు బాబాయ్ హత్య కేసులో నిందితులను కాపాడారని ఆరోపణ
- తల్లినీ, చెల్లినీ తరిమేసిన వ్యక్తిత్వం ఆయనదని వ్యాఖ్య




### వైద్య రంగంలో సరికొత్త విప్లవం 'సంజీవని'..

## ఇంటివద్దకే ఆధునిక వైద్యం.!

- ఇంటి వద్దే 42 వైద్య పరీక్షలు.. సంజీవని స్పెషల్
- డిజిటల్ హెల్త్ కార్డులతో కొత్త వైద్య విధానం
- ఏఐ డాక్టర్ సేవలు.. త్వరలోనే అందుబాటులోకి
- కుప్పం నుంచి రాష్ట్రవ్యాప్త విస్తరణకు సంజీవని రెడీ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంలో ఒక సరికొత్త డిజిటల్ విప్లవానికి తెరలేపింది. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం యాదమరి మండలం కండ్రిగలో జరిగిన 'సంజీవని' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ప్రారంభించిన అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రామ రావణ యుద్ధ సమయంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు తెచ్చిన సంజీవని మొక్కను గుర్తుచేస్తూ, అదే స్ఫూర్తితో డిజిటల్ హెల్త్ రికార్డుల ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ సరికొత్త 'సంజీవని' ప్రోగ్రామ్‌ను డిజైన్

2లో



## కలిసి పనిచేద్దాం!

- ప్రపంచ సౌభాగ్యం, శాంతి కోసం కృషి చేద్దాం
- ప్రధాని మోదీ, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో నిర్ణయం
- నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న రూబియో
- ఇరుదేశాల మధ్య సన్నిహిత సంబంధాలు ఎప్పటిలాగే కొనసాగుతున్నాయన్న మోదీ
- పశ్చిమాసియా పరిణామాలను వివరించిన రూబియో

న్యూఢిల్లీ: ప్రపంచ సౌభాగ్యం, శాంతి కోసం ఇకపైనా కలిసికట్టుగా పని చేయాలని భారత్, అమెరికా నిర్ణయించుకున్నాయి. ఇరుదేశాల మధ్య సన్నిహిత సంబంధాలు ఎప్పటిలాగే కొనసాగుతున్నాయని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. భారత పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో శనివారం ఢిల్లీలో మోదీతో సమావేశమయ్యారు. పశ్చిమాసియా పరిణామాలను మోదీకి వివరించారు. రక్షణ, వ్యూహాత్మక సాంకేతికతలు, వ్యాపారం, వాణిజ్యం, ఇంధన భద్రత వంటి కీలక రంగాల్లో భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక సహకారంపై వారిద్దరూ చర్చించుకున్నారు. రూబియో శనివారం ఢిల్లీకి చేరుకున్న కొద్దిసేపటికే మోదీతో భేటీ అయ్యారు. నాలుగు రోజులపాటు భారత్‌లో పర్యటించబోతున్నారు. గత ఏడాది కాలం నుంచి ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను పునఃసమీక్షించే ప్రయత్నంగా రూబియో పర్యటనను నిపుణులు పరిగణిస్తున్నారు.

2లో



## ధాన్యం కుప్పల మీదే రైతన్నల చావులు..

- ధాన్యం కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కార్‌కు కేటీఆర్ వార్నింగ్
- రైతుల మరణాలపై సీఎం రేవంత్‌ను నిలదీసిన బీఆర్ఎస్ నేత
- కేబినెట్ సమావేశంలో ధాన్యం అంశం చర్చించాలని డిమాండ్
- పెండింగ్ కొనుగోళ్లు వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వానికి సూచన

2లో

## మహానాడు పండుగలా జరపాలి..

- అందరం కలిసికట్టుగా పనిచేయాలి: మంత్రి నారా లోకేశ్
- ఈ నెల 27, 28 తేదీల్లో టీడీపీ మహానాడు
- క్లస్టర్ల స్థాయిలో వర్చువల్‌గా హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహణ
- 'స్త్రీ శక్తి మహానాడు' థీమ్‌తో కార్యక్రమాలు
- పార్టీ శ్రేణులను ఏకం చేసి, స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని లోకేశ్ పిలుపు
- మహానాడు విజయవంతానికి ఐక్యంగా పనిచేయాలని దిశానిర్దేశం



తెలుగుదేశం పార్టీ ప్రతిష్మాత్మకంగా నిర్వహించే మహానాడును ఈసారి క్లస్టర్ల స్థాయిలో ఒక పండుగ వాతావరణంలో, కలిసికట్టుగా విజయవంతం చేయాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. హైబ్రిడ్ విధానంలో ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న మహానాడు సన్నాహకాలపైద రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,875 క్లస్టర్ ఇంఛార్జ్‌లతో ఆయన ఆన్‌లైన్ ద్వారా సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఈసారి మహానాడును 'స్త్రీ శక్తి మహానాడు' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నామని, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. వాస్తవానికి ఈసారి మహానాడును నెల్లూరులో అత్యంత ఘనంగా మూడు రోజుల పాటు నిర్వహించాలని పార్టీ భావించింది. అయితే, అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా ఇంధన



## యుద్ధమా? ఒప్పందమా?

- ఇరాన్ త్వరగా తేల్చుకోవాలి
- ఆదివారం లోగా తుది నిర్ణయం తీసుకుంటా
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

# ధాన్యం కుప్పల మీదే రైతన్నల చావులు..

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల ఆలస్యంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (ఖు=) సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యవస్థలు పూర్తిగా కుప్పకూలాయని, అన్నదాతలు రోడ్డున పడుతున్నా పాలకుల్లో చలనం లేదంటూ మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పల మీదే రైతన్నలు గుండెలు ఆగి కుప్పకూలిపోతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. "రైతులు రాలిపోతున్నా చలనం లేని రాక్షస పాలన సాగుతోంది. అన్నదాతల చావులను చూసి ఆనందిస్తున్నావా ముఖ్యమంత్రి?" అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా నిలదీశారు. మండుటెండల్లో ఐయక కేంద్రాల (కొనుగోలు కేంద్రాల) కాడ రైతుల గుండెలు ఆగిపోతున్నా, ఈ కర్కశ ప్రభుత్వానికి కనీసం కనికరం కలగడం లేదా అని ప్రశ్నించారు. పంటలు కొనకుండా ఇంకెంత కాలం రైతులను యాతన పెడతారని, ఇంకెన్ని చావులు కావాలి, ఇంకెన్ని కుటుంబాలు రోడ్డున పడాలో చెప్పాలని అడిగారు. ప్రభుత్వ తీరును విమర్శిస్తూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "దున్నపోతు మీద వానపడ్డట్టు ప్రవర్తించడం ఆపండి" అంటూ కాంగ్రెస్ సర్కార్‌పై ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, మంత్రులు సోయి తెచ్చుకోవాలని హితవు పలికారు.

# మహానాడు పండుగలా జరపాలి..

(మొదటి పేజీ తరువాయి)

పొదుపు చర్యలు చేపట్టాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునకు స్పందించి, ఈసారి హైబ్రిడ్ విధానంలో మహానాడును రెండ్రోజులు నిర్వహించాలని నిర్ణయించినట్లు లోకేశ్ వివరించారు. దీని ప్రకారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే ప్రధాన కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్ కేంద్రాల్లో వర్చువల్‌గా మహానాడు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి క్లస్టర్ కేంద్రంలో ఎల్ఈడీ టీవీ, స్పీకర్లు వంటి సాంకేతిక ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ మహానాడును క్లస్టర్ వ్యవస్థను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి ఒక మంచి అవకాశంగా ఉపయోగించుకోవాలని లోకేశ్ అన్నారు. "క్లస్టర్ ఇంఛార్జ్‌లకు ఎక్కువ బాధ్యత ఇవ్వాలన్నది పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశం. ఈ వ్యవస్థ ద్వారానే మనం ముందుకు వెళ్లాలి" అని ఆయన పేర్కొన్నారు. క్లస్టర్ పరిధిలోని కుటుంబ సాధికార సారథి (కేఎస్ఎస్) నుంచి బూత్ ఇంఛార్జ్‌లు, గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాల సభ్యుల వరకు అందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని ఆదేశించారు.

# లండన్ వెళ్లొచ్చినా సైకో తత్వం పోలేదు

"గొడ్డలి పార్టీ అధ్యక్షుడు" కొత్తగా తాను అమాయకుడినని, అహింసావాదినని మాట్లాడుతున్నారని, కానీ ఆయన చరిత్ర, ఆయన పూర్వీకుల చరిత్ర ఏమిటో ప్రపంచమంతటికీ తెలుసని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన చేసిన దారుణాలు, హత్యల గురించి రాయలసీమలో ఏ గడపను అడిగినా చెబుతారని అన్నారు. రాజారెడ్డి రాజ్యాంగం గురించి అడిగితే కతలు కథలుగా వివరిస్తారని, అలాంటి రాజారెడ్డి పోలికలు తనకు వచ్చాయని గర్వంగా చెప్పుకున్న వ్యక్తి గొడ్డలి పార్టీ అధ్యక్షుడు అని ఆయన విమర్శించారు. తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని తన వ్యాపారానికి అడ్డొచ్చిన పరిటాల రవితో సహా ఎంతోమందిని హతమార్చిన చరిత్ర ఆయనదని అనగాని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీలపై అరాచకాలు చేసి, హత్యలు చేసి వారిపై దొంగతనం కేసులు పెట్టించిన చరిత్ర వాళ్లదని దుయ్యబట్టారు. గత ఐదేళ్ల పాలనలో చంద్రయ్య లాంటి పార్టీ విధేయులను కూడా పార్టీ మారమని గొంతుకోసి చంపారని, అమర్‌నాథ్ గౌడ్, సుధాకర్ వంటి ఎందరో బలైపోయారని గుర్తుచేశారు. ఈ సైకో చేసిన అరాచకాలను రాష్ట్ర ప్రజలు కళ్లారా చూశారని అన్నారు.

# తెలంగాణలో ఐఏఎస్, డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు..

తెలంగాణ రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో భారీ బదిలీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ (పరిపాలనా పరమైన కారణాలు) పై ఆరుగురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ (ఁతీఖఅంటవతీం ఖఅ ౯ాశీర్‌ఱఅస్త్రం) శనివారం ప్రభుత్వం అఫీషియల్ ఆర్డర్స్ జారీ చేసింది. దీనికి సంబంధించి రెవెన్యూ శాఖ సెక్రటరీ లోకేష్ కుమార్ డి.ఎస్. జీవో (+.ా.౯.చీశీ.286) రిలీజ్ చేశారు. ఈ లేటెస్ట్ ఉత్తర్వుల ప్రకారం బదిలీ అయిన అధికారులు, వారి కొత్త పోస్టింగ్స్ వివరాలు కింద ఉన్న పారాగ్రాఫ్ లో చూడవచ్చు. కరీంనగర్ ఎస్‌డీసీ (ాణజ, ాూ) గా పనిచేస్తున్న ఎస్. కిరణ్ ప్రకాష్‌ను స్టేషన్ ఘన్‌పూర్ ఆర్‌డీఓ (=ఇూ) గా బదిలీ చేశారు. అలాగే స్టేషన్ ఘన్‌పూర్ ఆర్‌డీఓగా పోస్టింగ్ ఆర్డర్స్‌లో ఉన్న ఆర్.వి. రాధా బాయిని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (వీూ&ఖఔ) డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేస్తూ.. అక్కడ నుండి కుడా (ఖఖణూ) ఎస్‌డీసీగా వన్ ఇయర్ పీరియడ్ కోసం డెప్యుటేషన్‌పై నియమించారు.

# యుద్ధమా? ఒప్పందమా?

వాషింగ్టన్/ఇస్లామాబాద్: పశ్చిమాసియాలో సంక్షోభానికి తెరదించడానికి ఇరాన్ తమతో ఒప్పందానికి రాకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరించారు. ఇరాన్‌పై బాంబు దాడులు పునఃప్రారంభించాలా? లేదా? అనే దానిపై తన ఆలోచనలు ఫిఫ్టీ.. ఫిఫ్టీగా ఉన్నాయని తేల్చిచెప్పారు. ఆదివారం నాటికి తుది నిర్ణయం తీసుకోవాలని ఆశిస్తున్నట్లు స్పష్టంచేశారు. ఆయన శనివారం ఓ వార్తా సంస్థతో మాట్లాడారు. ఇరాన్ వ్యవహారంలో రెండు అంశాల్లో ఏదో ఒకటి జరుగుతుందని అనుకుంటున్నానని వెల్లడించారు. ఒకటి.. వారు(ఇరాన్) ఇంతకు ముందెన్నడూ ఎదుర్కోనంత గట్టిగా తాను దెబ్బకొడతానని వ్యాఖ్యానించారు. రెండోది.. ఒక మంచి ఒప్పందంపై ఇరాన్, అమెరికా సంతకాలు చేస్తాయని పేర్కొన్నారు. యుద్ధం కావాలో లేక ఒప్పందం కావాలో ఇరాన్ త్వరగా తేల్చుకోవాలని సూచించారు. ఇరాన్‌తో తాను చక్కటి ఒప్పందాన్ని కుదుర్చుకోవచ్చని లేదా ఆ దేశాన్ని పూర్తిగా నాశనం చేయవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఇరాన్, పాకిస్తాన్ మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఒక ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దీని ప్రకారం.. అమెరికా, ఇరాన్‌లు సైనిక చర్యను నిలిపివేయాలి. ఒక స్పష్టమైన ఒప్పందానికి రావడమే లక్ష్యంగా 30 రోజుల పాటు విస్తృతస్థాయిలో చర్చలు జరపడానికి ఇరుదేశాలు అంగీకరించాలి. చివరి నిమిషంలో జరిగే చర్చలు శాంతి ఒప్పందానికి దారితీయకపోతే, ఇరాన్‌పై కొత్తగా దాడులు చేసే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నారని అమెరికా మీడియా సంస్థ ఆక్సియోస్ వెల్లడించింది.

# కలిసి పనిచేద్దాం!



(మొదటి పేజీ తరువాయి)

రూబియోను కలవడం ఆనందంగా ఉందంటూ మోదీ సోషల్ మీడియాలో పోస్టుచేశారు. భారత్‌అమెరికా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో నిరంతర పురోగతి, ప్రాంతీయ, ప్రపంచ శాంతి భద్రతకు సంబంధించిన అంశాలపై తాము చర్చించామని వెల్లడించారు. రెండు దేశాలు నిరంతరం సన్నిహితంగా కలిసి పనిచేస్తూనే ఉంటాయన్నారు. వాణిజ్య, రక్షణ సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవడానికి, కీలకమైన, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై సహకారాన్ని వేగవంతం చేయడానికి మోదీ, రూబియో అంగీకరించారని అమెరికా విదేశాంగ శాఖ తెలియజేసింది. భారత్, అమెరికాలు అనేక రంగాల్లో ద్వైపాక్షిక సహకారంలో సాధించిన పురోగతి గురించి రూబియో ప్రధాని మోదీకి వివరించారని భారత ప్రభుత్వవర్గాలు తెలిపాయి. పశ్చిమాసియాలో శాంతి ప్రయత్నాలకు భారత్ నిరంతరం మద్దతు ఇస్తుందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారని పేర్కొన్నాయి. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సంఘర్షణలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని మరోసారి పిలుపునిచ్చారని స్పష్టంచేశాయి. మోదీ, రూబియో మధ్య ఫలవంతమైన సమావేశం జరిగిందని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు. భారత్ తమకు అత్యంత ము ఖ్యమైన భాగస్వామి అని రూబియో తేల్చిచెప్పారు. మోదీతో భేటీ అనంతరం అమెరికా ఎంబసీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంబంధాలను మరింత పటిష్ఠం చేసుకునేందుకు రాబోయే రో జుల్లో ఇరుపక్షాలు కొన్ని కీలక ప్రకటనలు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయని తెలిపారు. ఇండోపసిఫిక్ విషయంలో వాషింగ్టన్ విధానానికి భారతదేశం 'ఒక మూలస్తంభం'అని అభివర్ణించారు. త్వరలో అమెరికా పర్యటించాలని, వైట్‌హౌస్‌ను సందర్శించాలని కోరుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరపున మార్కో రూబియో ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించారు. ఈ విషయం అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలియజేశారు. మోదీతో భేటీ సందర్భంగా ఈ ఆహ్వానం అందించారని చెప్పారు. డొనాల్డ్ ట్రంప్‌కు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయాలని రూబియోను మోదీ కోరారని ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ) ఒక ప్రకటనలో పేర్కొంది. ట్రంప్‌తో సంభాషణ కోసం ఎదురుచూస్తున్నానని చెప్పారని వెల్లడించింది. కోల్‌కతాలో మదర్ హౌస్‌ను సందర్శించిన రూబియో నాలుగు రోజుల పర్యటన కోసం భారత్‌కు వచ్చిన మార్కో రూబియో తొలుత కోల్‌కతాలో అడుగుపెట్టారు. సెర్గియో గోర్ ఆయనకు స్వాగతం పలికారు. అమెరికా విదేశాంగ మంత్రి ఒకరు కోల్‌కతాలో పర్యటించడం 14 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. చివరిసారిగా 2012 మే నెలలో అప్పటి అమెరికా విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ ఇక్కడ పర్యటించారు. మార్కో రూబియో కోల్‌కతాలో ప్రఖ్యాత మదర్ హౌస్‌ను సందర్శించారు. ఇది భారత రత్న మదర్ థెరిసా స్థాపించిన 'మిషనరీస్ ఆఫ్ చారిటీ' ప్రదాన కార్యాలయం. మదర్ హౌస్ అధికారులతో రూబియో మాట్లాడారు. అనంతరం నిర్మల శిశు భవన్ కూడా సందర్శించారు. ఇది మిషనరీస్ ఆఫ్ చారిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న పిల్లల సంరక్షణ కేంద్రం. రూబియో ఈ నెల 26వ తేదీ వరకు భారత్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 'క్వాడ్'దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరవుతారు. ఢిల్లీతోపాటు ఆగ్రా, జైపూర్‌లో పర్యటిస్తారు.

## వైద్య రంగంలో సరికొత్త విప్లవం 'సంజీవని'..

# ఇంటివద్దకే ఆధునిక వైద్యం.!

(మొదటి పేజీ తరువాయి)

చేసినట్లు సీఎం వెల్లడించారు.ఈ సభలో సీఎం చంద్రబాబు ఆరోగ్యం ప్రాధాన్యత గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. మనిషికి ఎంత సంపద ఉన్నా ఆరోగ్యం లేకపోతే వృథా అని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నవారే అందరికన్నా నిజమైన ధనవంతులని పేర్కొన్నారు. ఏదో బతికి ఉన్నాం కదా అని మంచంపై కాలం వెళ్లదీయడం కాకుండా, ప్రతి ఒక్కరూ హెల్తీగా బతకడమే ముఖ్యమన్నారు. భవిష్యత్తులో మన పిల్లలే మన సంపద అని, ఆరోగ్యవంతమైన ప్రజలు ఉన్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. మారుమూల ప్రాంతాల్లో ఉండే పేద ప్రజలకు సైతం అత్యుత్తమ కార్పొరేట్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ఈ సంజీవని ప్రాజెక్టు మెయిన్ ఎయిమ్ అని స్పష్టం చేశారు. సమాజం బాగుండాలంటే ప్రజలు ఫిట్‌గా ఉండాలని, అందుకోసమే ప్రిడిక్టివ్ (ముందుగా ఊహించడం), ప్రివెంటివ్ (నివారించడం), క్యూరేటివ్ (నయం చేయడం) అనే మూడు అంచెల విధానంలో సంజీవని ప్రాజెక్టును ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. వ్యాధులు వచ్చాక బాధపడటం కంటే, అవి రాకముందే గుర్తించి అలర్ట్ చేయడమే నిజమైన డెవలప్‌మెంట్ అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ల్యాబ్‌లకు వెళ్లే అవసరం లేకుండా ఏకంగా 42 రకాల వైద్య పరీక్షలను నేరుగా ఇంటి వద్దే నిర్వహించి నిమిషాల్లో రిపోర్టులు ఇచ్చేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. డాక్టర్ అప్పాయింట్‌మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా టాప్ డాక్టర్స్ వైద్య సలహాలు, సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డుల మానిటరింగ్ వంటి అడ్వాన్స్‌డ్ ఫీచర్స్ ఇందులో ఉన్నాయి. ఈ సంజీవని ప్రాజెక్టు అనేది కేవలం ఒక సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదని, ఇదొక అత్యుత్తమ 'డిజిటల్ పబ్లిక్ హెల్త్ ఆపరేటివ్ సిస్టమ్' అని చంద్రబాబు అభివర్ణించారు. ప్రజలను అనారోగ్యం నుంచి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మార్చే 'సిటిజన్ వెల్‌నెస్ మిషన్' ఇదన్నారు. టెక్నాలజీని వాడుకోవడంలో ఎప్పుడూ ముందే ఉండే చంద్రబాబు సర్కార్.. త్వరలోనే ఈ ప్రాజెక్టులో భాగంగా 'ఏఐ డాక్టర్' (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ద్వారా కూడా ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందించబోతున్నట్లు క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. గత ఏడాది జూలైలో కుప్పం నియోజకవర్గంలో ఈ ప్రాజెక్టును పైలట్‌గా ప్రారంభించి, మార్చి 15 నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా రోల్ అవుట్ చేశారు. జిల్లాలోని 19.75 లక్షల మంది ఆరోగ్యాన్ని కాపాడేలా ప్రజారోగ్య వ్యవస్థను సిద్ధం చేశారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ సక్సెస్‌తో రాబోయే ఆగస్టు 15 (స్వాతంత్ర్య దినోత్సవం) నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టును ఫుల్ స్కేల్‌లో లాంచ్ చేయాలని నిర్ణయించినట్లు సీఎం చంద్రబాబు అనౌన్స్ చేశారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులపై కూడా సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా స్పందించారు. ఈ సంవత్సరం వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ రిపోర్ట్స్ చెప్తున్నాయని, అయితే ఎలాంటి పరిస్థితినైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తమ ప్రభుత్వం పూర్తి సన్నద్ధతతో ఉందని ప్రజలకు భరోసా ఇచ్చారు.



# వేద పాఠశాలకు భూమిపూజ

యాదాద్రి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 99.55 కోట్ల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులన్నింటికీ ఒకచోట పెద్దగుట్టపై శిలాఫలకం వేశారు. అందులో ప్రధానమైనది వేద పాఠశాల. వేద పాఠశాల సముదాయ నిర్మాణానికి భూమిపూజ మహోత్సవం వైభవంగా జరిగింది. కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతిస్వామి వేద ఆశీర్వచనం అనంతరం అభివృద్ధి పనులకు సీఎం భూమి పూజ చేశారు. సీఎంతోపాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అభివృద్ధి పనులకు భూమిపూజ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి కొండపైకి కాన్వాయ్‌లో చేరుకున్నారు. ప్రధానాలయం తూర్పు రాజగోపురం నుంచి, త్రితల గోపురం గుండా ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయ అర్చక బృందం, వేదపండితులు పూర్ణకుంభంతో సీఎంకు స్వాగతం పలకగా మొహోదట ఆంజనేయస్వామిని దర్శించుకొని ఆ తర్వాత ప్రధానాలయంలోని స్వయంభూలను, ఉత్సవ మూర్తులను దర్శించుకుని రేవంత్ పూజలు నిర్వహించారు. వేదపండితులు ప్రధానాలయం ముఖమండపంలో సీఎంకు వేదాశీర్వచనం చేశారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, ఆలయ ఈవో భవాని శంకర్ స్వామివారి జ్ఞాపికను సీఎంకు అందజేశారు. వంశపారంపర్య ధర్మకర్త నరసింహమూర్తి లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం సీఎం పశ్చిమ రాజగోపురం గుండా ఆలయం నుంచి బయటకు వచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట పర్యటనలో ప్రొటోకాల్ వైఫల్యం చోటుచేసుకుంది. సీఎం, మంత్రులు ఉన్న హెలికాప్టర్ ప్రొటోకాల్ ప్రకారం నిర్దేశిత యాదగిరిగుట్ట గోశాల స్థలంలో ల్యాండ్ కావాల్సి ఉండగా దానికి బదులు పెద్దగుట్టపై దిగింది. అక్కడ స్వాగతం పలికేందుకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, భద్రతా అధికారులు ఎవరూ లేకపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు 10 నిమిషాలపాటు హెలికాప్టర్‌లోనే వేచి చూశారు.

# 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించనుంది. మిగిలిన 500 ఇళ్లను గతంలో వివిధ గృహనిర్మాణ పథకాల కింద మంజూరై వివిధ కారణాలతో అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్లను పూర్తి చేయడానికి కేటాయించనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం సచివాలయంలో మంత్రివర్గం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్ నిర్ణయాలను మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరితో కలిసి గృహనిర్మాణ, సమాచార, ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.

### అసంపూర్తి ఇళ్లకు ఇందిరమ్మ అండ...

ఉమ్మడి ఏపీలో దివంగత వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం, గత ప్రభుత్వం చేపట్టిన గృహలక్ష్మి పథకం లబ్ధిదారులతోపాటు ఇంకా ఎవరైనా లబ్ధిదారుల ఇళ్లు అసంపూర్తిగా మిగిలి ఉంటే ఈ పథకం కింద ప్రయోజనం కల్పించనున్నారు. పునాదులు పూర్తై గోడలు, శ్లాబు పడని ఇళ్లకు రూ. 3 లక్షలు, గోడలు పూర్తై శ్లాబు నిలిచిపోయిన ఇళ్లకు రూ. 2 లక్షల చొప్పున సహాయం చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. మూడో, నాలుగో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద సైతం అసంపూర్తిగా మిగిలిన ఇళ్లకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేయాలని మంత్రివర్గ సమావేశంలో తీర్మానించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులు ప్రస్తుత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అనర్హులని తొలి విడతలో ప్రభుత్వం చెప్పింది. నాడు సిమెంట్, స్టీల్, నగదు రూపంలో రూ. 25 వేలు తీసుకున్న వారిని రెండోవిడత ఇందిరమ్మ పథకం కింద అర్హులుగా పరిగణించాలని తాజాగా మంత్రివర్గం నిర్ణయించింది. ఆ రూ. 25 వేలను మినహాయించుకొని రూ. 5 లక్షల్లో మిగిలిన మొత్తాన్ని వారికి అందజేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 14,800 పూరి గూడిసెలున్నట్లు వివిధ దఫాలుగా చేసిన సర్వేల్లో రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. రెండో విడత ఇందిరమ్మ పథకం కింద ఆయా కుటుంబాలకు ఇళ్లను మంజూరు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. గుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను నిలపాలని నిర్ణయించింది. ఇందిరమ్మ పథకం కింద కోర్ అర్బన్ ఏరియా (క్యూర్) పరిధిలో 67 లక్షల మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా వారిలో 18,500 మందికి మాత్రమే సొంత స్థలాలు ఉన్నాయి. వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ. 5 లక్షలను నెలాఖరులోగా ప్రభుత్వం మంజూరు చేయనుంది. మిగిలిన దరఖాస్తుదారుల్లో సొంత స్థలాలు లేని 33.5 లక్షల మంది అర్హులుంటారని ప్రభుత్వం అంచనా వేసింది. క్యూర్ ఏరియాలోని గ్రేటర్ హైదరాబాద్, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఉన్న 24 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గాన్ని యూనిట్‌గా పరిగణించి అల్పాదాయ వర్గాలు (ఎల్‌ఐజీ), మధ్యతరగతి వర్గాల (ఎంఐజీ)కు లక్ష ఇళ్లను నిర్మించి ఇవ్వాలని మంత్రివర్గం తీర్మానించింది.

ఎల్‌ఐజీ ఇళ్ల పథకం కింద 400420 చదరపు గజాల విస్తీర్ణంతో ఫ్లాట్ల నిర్మాణానికి రూ. 5 లక్షలతోపాటు అన్‌డివైడ్ ల్యాండ్ షేర్‌ను ప్రభుత్వం ఉచితంగా ఇవ్వనుంది. రూ. 4 లక్షల నుంచి రూ. 5 లక్షల అదనపు వ్యయాన్ని లబ్ధిదారులు భరించాల్సి రానుంది. నిరుపేదలు జీవనోపాధి కోసం ఎక్కడ నివసిస్తున్నారో అక్కడే ఎల్‌ఐజీ ఇళ్లను నిర్మించనున్నారు. మురికివాడల్లో నివసిస్తే అక్కడే కట్టిస్తామని పొంగులేటి తెలిపారు. వారు ఉండే ప్రాంతంలో ప్రభుత్వ స్థలం లేకుంటే హౌసింగ్ బోర్డు, ఇతర ప్రభుత్వ శాఖల నివాసయోగ్యమైన భూముల్లో వారి కోసం ఇళ్లను నిర్మించనున్నారు.



## చిన్న బాబు కుటుంబానికి ఎం ఎం ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 5000/- ఆర్థిక సాయం

**ప్రత్తిపాడు,వజ్రభారతి,ప్రతినిధి,మే,23:-** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన పాలిక చిన్నబాబు ఇటీవల కాలంలో కాలు, చేయి సమస్యలతో అనారోగ్యానికి గురై బాధపడుతున్నారని తెలిసి, వారిని స్వయంగా పరామర్శించిన ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్‌సిపి నాయకులు, నరసాపురం పార్లమెంటు పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నబాబు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సాయం అందజేసి, కుటుంబానికి ఎలాంటి కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ ముందుండే నాయకుడిగా మురళిరాజు మరోసారి తన మనసున్న మనిషితనాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో జువ్వల దొరబాబు, కోన బాబ్జి, తూపాటి బాబ్జి, యాళ్ల ఏసు, జువ్వల ముసలయ్య, రాపా అప్పన్న, మారెళ్ళ అప్పన్నబాబు, అంబటి అపోజి, బీజ అప్పలరాజు, గుబ్బల కుమార్, కుడుముల శ్రీను మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కష్టసుఖాల్లో భాగస్వామ్యం

### పత్తికొండ నియోజకవర్గ పరిధిలో ఉన్న చక్రాల గ్రామానికి విచ్చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్



**పత్తికొండ (చక్కెరల్లు) మే 23 (వజ్ర భారతి న్యూస్):** పత్తికొండ మండలం చక్రాల గ్రామంలో ఏబీవీపీ పూర్వపు విద్యార్థి నాయకుడు, కరీంనగర్ -- నిజామాబాద్ ప్రాంతాలలో ఏబీవీపీ ఫుల్ టైం వర్కర్‌గా పనిచేసిన చక్రాల సుధాకర్ గారి అమ్మగారికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆమెను పరామర్శించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి గారు గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పత్తికొండ బీజేపీ మండల అధ్యక్షుడు కరణం నరేష్ కేంద్రమంత్రి బండి సంజయ్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. కార్యకర్తల కష్టసుఖాలలో భాగస్వామ్యం అవుతూ, వారి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ప్రత్యేకంగా గ్రామానికి రావడం బండి సంజయ్ గారి సేవాభావానికి నిదర్శనమని కొనియాడారు. కార్యకర్తల పట్ల బీజేపీ నాయకత్వం చూపుతున్న ఆప్యాయత, అంకితభావం కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తుగ్గలి నవీన్ రెడ్డి . బ్రహ్మయ్య దండి మల్లికార్జున, రామాంజనేయులు సిసి రంగన్న గోవర్ధన్ నాయుడు ఎద్దులదొడ్డి లక్ష్మణస్వామి రాంపల్లి రంగయ్య వీరేష్ హరీష్ నాయక్ గోరంట్ల కరణం చంద్రన్న తంబల నాగేష్ సురేంద్ర రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు

## ఓవర్ లోడ్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము : ఏ ఈ శ్రీనివాస్

### పైడిమెట్ట కు తొలగిన కరెంట్ కష్టాలు



**తాళ్లపూడి, వజ్ర భారతి మే 23:** తాళ్లపూడి మండలం లో వేసవి లో విద్యుత్ వినియోగం పెరగటం అక్కడున్న ట్రాన్స్ఫార్మర్ కెపాసిటీ తక్కువగా ఉండటం వల్ల తరచు విద్యుత్ సరఫరా కి ఆటంకం కలుగుతోందని, పైడిమెట్ట, వేగేశ్వర పురం గ్రామాల్లో ఈ ఇబ్బందులు ఎదురయ్యాయి అని ట్రాన్స్కో ఏ.ఈ తెలిపారు. ఓవర్ లోడ్ కారణంగా పైడిమెట్ట లో విద్యుత్ సరఫరా అంతరాయాల తో ఇబ్బందులు పడుతున్న నేపథ్యం లో అదనంగా 15 కె.వి.ట్రాన్స్ఫార్మర్ వేసి నట్లు తాళ్లపూడి సబ్ స్టేషన్ ఏ.పి.ఈ.పి. డి.సి.ఎల్ ఏ.ఈ శ్రీనివాసరావు తెలిపారు. కాగా వేగేశ్వరపురం లో కూడా ఎక్కువ సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపోయి వేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యం లో ఆ గ్రామం లో కూడా అదనపు లోడ్ ట్రాన్సఫార్మర్ వేయలని గుర్తించినట్లు ఈ మేరకు చర్యలు తీసుకున్నామని ఏ.ఈ. తెలిపారు. వేగేశ్వరపురం లో కూడా మూడు చోట్ల 15 కె.వి కెపాసిటీ ట్రాన్స్ఫార్మర్ లు వేశామని తెలిపారు. ప్రజలంతా సహకారం కూడా అంద చేయాలని కోరారు.





# కోటనందూరు మండలంలో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం

**వేసవి తాపంతో అల్లాడిన ప్రజలకు ఉపశమనం • నేలకొరిగిన చెట్లు, కరెంటు స్తంభాలు, అరటి తోటలు**

**కోటనందూరు, మే 23, వజ్రభారతి:** కాకినాడ జిల్లా, కోటనందూరు మండలంలో శనివారం మధ్యాహ్నం భారీ ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో గత కొంతకాలంగా వేసవితాపముతో అల్లాడుతున్న ప్రజలు సేద తీరారు. అయితే భారీ ఈదురు గాలులకు కరెంటు స్తంభాలు నేలకొరిగాయి. ఇండుగపల్లి గ్రామంలో 10, కోటనందూరు లో 10, ఎస్ఆర్ పేట 5,పి కొట్టాం 6, కే ఏ మల్లవరంలో 6 ,బిళ్లనందూరు లో 2 నేల కొరిగినట్లు ప్రాథమిక సమాచారముగా ఎలక్ట్రికల్ ఏఈ వెంకటరమణ తెలియజేశారు. 11 కేవీ లైన్లు డామేజ్ అయినట్లు తెలియజేశారు. ఈదురుగాలులకు అనేక వృక్షాలు నేలకొరగగా, రైతుల పశువుల మకాములలో పశువుల కోసం ఉంచుకున్న వరి గడ్డి కూడా ఈదురుగాలులకు ఎగిరిపోయింది. దీనివలన పశువులు మేపుతున్న రైతులు నష్టపోయారు. అల్లిపూడి గ్రామంలో సుమారు 10 ఎకరాలు అరటి తోట నేలకొరిగినట్లు స్థానికులు తెలియజేశారు.



## 29న అమలాపురంలో ఏపీ రాష్ట్ర ఆక్వా రైతు సదస్సు

### వేలాదిగా ఆక్వా రైతులు హాజరవ్వాలి

**జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గాంధీభగవన్రాజు పిలుపు**



**పాలకొల్లు, (వజ్ర భారతి) న్యూస్: మే 23:** ఏపీ రాష్ట్రవ్యాప్తంగా ఆక్వా రైతు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29వ తేదీన అమలాపురంలో ఏపీ రాష్ట్ర ఆక్వా రైతు సదస్సు ఏర్పాటు చేసినట్లు జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు వెల్లడించారు. ఆ సదస్సుకు వేలాదిగా ఆక్వా రైతులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో గాంధీభవన్రాజు మాట్లాడారు. ఈ సమావేశంలో ఆక్వా రైతులు ఫీడ్, సీడ్, ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు వల్ల ఎదుర్కొంటున్న సమస్యల గురించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. రొయ్యల ధర తగ్గించి కొనుగోలు చేస్తున్న ప్రాసెసింగ్ ప్లాంట్లు ముట్టడించడానికి కూడా వెనుకాడా బోమని హెచ్చరించారు. రొయ్యల దానా ధర పెంచి విక్రయించే కంపెనీలను బహిష్కరించడం, క్రాప్ హాలిడే నిర్ణయం కూడా రాష్ట్రస్థాయి సమావేశంలో తీసుకోవడం జరుగుతుందని గాంధీభగవన్రాజు తెలిపారు. దళారులు మరింత పడిపోతుందని, రొయ్యలు వెంటనే విక్రయించుకోవాలని తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని దానికి మీరు లొంగ వద్దని రైతులకి హితవు పలుకారు. ఎక్కడైనా రొయ్యలు ఎండ దెబ్బకు చనిపోతున్న, లేదంటే వైరస్ వచ్చిన చెరువులు మాత్రమే పట్టుబడు చేసుకోవాలని ఆయన కోరారు. ఒక పిలుపుతో శుక్రవారం నాడు అధిక సంఖ్య లో రొయ్య రైతులు హాజరు అయ్యి రాస్తారోకో విజయవంతం చేసినందుకు గాంధీ భగవాన్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఐక్యమత్యంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన ఆక్వా రైతు సంఘం నాయకులు, రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యి రాష్ట్రస్థాయి సదస్సు విజయవంతం చేయాలని గాంధీ భగవాన్ రాజు కోరారు. ఈ సమావేశంలో మేడి జాన్ డేవిడ్ రాజు, పి సత్యనారాయణ రాజు, జి సంజీవరాజు, దాట్ల సోంబాబు రాజు, తదితరులు పాల్గొన్నారు.



## గోల్డ్ మైన్స్ లో భూములు కోల్పోయే రైతులకు ఫ్యాక్టరీలో ఉపాధి కల్పిస్తాం: ఆర్డీవో ఓబులేష్



**తుగ్గలి మే 23 (వజ్ర భారతి న్యూస్):** మండలంలోని జొన్నగిరి గోల్డ్ మైన్స్ కు భూములు కోల్పోయే రైతులకు తగినంత నష్టపరిహారంతో పాటు ఫ్యాక్టరీలో ఉపాధి కల్పిస్తామని ఆర్డిఓ ఓబులేష్ తెలిపారు. శనివారం జొన్నగిరి, ఉప్పర్లపల్లె గ్రామాలకు చెందిన రైతులు తో మైన్స్ కు భూసేకరణ కోసం రైతులతో ఆర్డిఓ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో తహసిల్దార్ రవి, విఆర్ఓ కాశి రంగస్వామి, రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

## పశువైద్య శాలకు స్వంత భవనం ఎప్పుడు?



**తాళ్లపూడి, వజ్ర భారతి మే 23:** మండల కేంద్రం లోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అన్న అప్పటి టిడిపి ప్రభుత్వ హయాం లో కానీ, రైతుభరోసాలు, సచివాలయాలకు స్వంత భవనాలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు చేపట్టిన వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాం లో కానీ తాళ్లపూడి పశు వైద్య శాలకు స్వంత భవన నిర్మాణానికి నోచుకోలేదు. అంతే కాదు, తాళ్లపూడి లోనే ఒక స్థలం లో పశు వైద్యశాల, మరోసారి వేగేశ్వరపురం లోను పశువైద్య శాల కట్టించారు. కానీ పలు కారణాలతో ఆ భవనాలు పశు వైద్య శాలకు దక్కలేదు. ఈ ప్రాంతం లోని రైతులకు అందుబాటులో ఉండాల్సిన పశువైద్య శాల స్వంత భవన ఏర్పాటు పై ఒక్క నాయకుడు కూడా దృష్టి సారించక పోవటం బాధాకరం. కాగా పంచాయతీ కి చెందిన ఓ షెడ్ లో నే నేటి వరకు సాగుతోంది. డాక్టర్ లేని క్లిష్ట పరిస్థితులు దాటినా, ఇటీవల ఉన్న ఆ కాస్త షెడ్ ఆక్రమణల చెర కు గురయ్యింది. గతం లో మాదిరిగా పశువులు ను ఆస్పత్రి కి తెచ్చుకునే పరిస్థితులు కరువయ్యాయి. కానీ గ్రామాల్లో వున్న చిన్న స్థాయి పశు వైద్య కేంద్రాల కంటే మండల కేంద్రం లో ఉన్న ఆస్పత్రి కే ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. కాగా పశు వైద్య శాఖ జె.డి (జిల్లా అధికారి) మాట్లాడుతూ తాళ్లపూడి పశువైద్య శాలకు స్వంత భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టామని, ప్రభుత్వ అనుమతి కై ఎదురు చూస్తున్నామని తెలిపారు .

## ఖరీఫ్‌పై ఎల్ నినో ప్రభావంపై రైతులకు ఏవో జోకా అమృత సూచనలు

**ఉత్తరకంచి,పెద్దిపాలెం గ్రామాల్లో అవగాహన సదస్సు**



**ప్రత్తిపాడు,వజ్రభారతి,ప్రతినిధి,మే,23:-** ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి,పెద్దిపాలెం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారిణి జోకా అమృత ఆధ్వర్యంలో రైతులకు ఎల్ నినో ప్రభావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులు ముందస్తుగా సాగుకు సమాయత్తం కావాలని సూచించారు. తక్కువ కాలంలో పండే వరి రకాలను ఎంపిక చేసుకుని సాగు చేయాలని రైతులకు తెలియజేశారు. అలాగే వరి సాగుకు అనుకూలం కాని భూముల్లో మినుములు, పెసర్లు,నీటిఎద్దడిని తట్టుకునే రాగులు, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో ఎండాకాలానికి సంబంధించిన పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జీలుగ విత్తనాలు 10 క్వింటాళ్లు, జనుము విత్తనాలు 10 క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నట్లు తెలిపారు. జీలుగ విత్తనాలు కిలో రూ.80కి, జనుము విత్తనాలు కిలో రూ.77కి అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరకంచి తాజా మాజీ సర్పంచ్ మంతెన వెంకటరమణ,సుబ్బారారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ల అప్పారావు,వ్యవసాయ శాఖ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.



## విజయ రాజు ను పరామర్శించిన ఆటో యూనియన్ సభ్యులు.

**తాళ్లపూడి, వజ్ర భారతి మే 23:** తాళ్లపూడి లో గల సాయి స్ఫూర్తి హాస్పిటల్స్ సి.ఈ.ఓ గూడ విజయ రాజు ను తాళ్లపూడి ఆటో యూనియన్ సభ్యులు రజని ఆధ్వర్యంలో ఆరోగ్య క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల అనారోగ్యం కారణంగా సి.ఈ ఓ రాజు హైదరాబాద్ లోని యశోద ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొంది తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు గూడా విజయరాజు క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు.

## ఆర్ అండ్ బి రోడ్లపై ఇసుక వార్త కు స్పందించిన అధికారులు



**తాళ్లపూడి, వజ్ర భారతి మే 23:** తాళ్లపూడి మండలం లో ఇసుక రీచ్ లకు దగ్గరగా ఉన్న ఆర్ అండ్ బి రోడ్లన్నీ లారీల నుండి పడ్డ ఇసుకతో నిండి ప్రమాద భరితంగా మారిందన్న మీడియా కథనాలకు స్పందించి, తాళ్లపూడి తహసిల్దార్ లక్ష్మీ లావణ్య తక్షణ చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు శనివారం రోడ్లపై బడ్డ ఇసుక తొలగించే విధంగా చర్యలు చేపట్టారు. యేటి గట్టు మీద, పైడిమెట్ట గ్రామం వద్ద కూడా రోడ్లపై ఇసుక ను తొలగించే విధంగా చర్యలు తీసుకున్నామని ఆమె తెలిపారు. దీనితో ఆ దారుల్లో పయనించే ప్రజలకు ధైర్యం కలిగింది. ద్వి చక్ర వాహనదారులు తహశీల్ధార్ చర్యలకు ధన్యవాదాలు తెలిపారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కు ఘనంగా సన్మానించిన తుగ్గలి నవీన్ రెడ్డి



**పత్తికొండ/తుగ్గలి మే 23( వజ్ర భారతి న్యూస్):** నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండకు విచ్చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి నవీన్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయనకు శాలువాను కప్పి ఘనంగా సన్మానించారు. శనివారం రోజున పత్తికొండ మండలంలోని చక్రాల గ్రామానికి చెందిన ఆర్.ఎస్.ఎస్ సంఘ మిత్రుడు సుధాకర్ కలవడానికి వచ్చిన ఆయనను బిజెపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం పత్తికొండ నియోజకవర్గం బిజెపి నాయకుల,కార్యకర్తల ఆధ్వర్యంలో ఆయన చక్రాల గ్రామంలో తమ ఆర్ఎస్ఎస్ సంఘ మిత్రుడు సుధాకర్ ను కలిశారు.కేంద్ర మంత్రిగా ఉంటూ తమ సంఘ మిత్రుడిని గుర్తుంచుకొని కలవడానికి రావడం చాలా గొప్ప విషయమని బిజెపి నాయకులు తుగ్గలి నవీన్ రెడ్డి తెలియజేశారు.అనంతరం కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భారతీయ జనతా పార్టీ అభివృద్ధి కొరకు కృషి చేయాలని బిజెపి శ్రేణులకు ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండలాల అధ్యక్షులు నరేష్,లక్ష్మన్న,శంకర్ బాబు,బిజెపి నాయకులు దండి మల్లికార్జున,రామ్మోహన్, మార్కెట్ డైరెక్టర్ గోవర్ధన్,భాస్కర్ రెడ్డి, బ్రహ్మయ్య తదితర బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టిసీమలో ఉపాధిహామీ పథకం కూలీలకు మజ్జిగ పంపిణి..

**పోలవరం మే 23 ( వజ్ర భారతి):** పోలవరం మండలం పట్టిసీమ పంచాయతీ బంగారమ్మపేట గ్రామంలొ శనివారం ఉపాధిహామీ పథకం కూలీలకు (శ్రామికులు) సుమారు 200 మందికి మజ్జిగ పంపిణి చేశారు. ఎన్ ఆర్ ఈ జి ఎస్ ఏపీఓ సూచనలతో టెక్నికల్ అసిస్టెంట్ ప్రమోద్ , ఫీల్డ్ అసిస్టెంట్ హేమ, శేషు, దత్తు దేవి, మేట్లు ఉపాధిహామీ పథకం కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఉక్కపోత ను దృష్టిలో పెట్టుకుని మజ్జిగ అందజేశామన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని ఉపాధి హామీ కూలీలకు అవసరమైన త్రాగునీరు, నీడ, ప్రధమ చికిత్స పేట్టే వంటి కనీస వసతులను కల్పిస్తున్నారు.



# పంట కాలువ పనులను నిర్దేశించిన గడువు లోగా పూర్తి చేయాలి....

### గోదావరి డెల్టాకు మే 31 నుంచే నీరు... చివరి ఎకరం వరకు సాగునీరు లక్ష్యం- మంత్రి నిమ్మల

**పాలకొల్లు,( వజ్ర భారతి) న్యూస్ మే 23::** పంట కాలువలపై కోట్లాది రూపాయితో జరుగుతున్న పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా నాణ్యత ప్రమాణాలతో నిర్దేశించిన గడువు లోగా పూర్తి చేయాలని రాష్ట్ర జలవనూర్ల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులోని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం జిల్లాలో సాగునీటి పరిస్థితులపై ఇరిగేషన్ అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఓఅండ్ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనుల పురోగతిని సమగ్రంగా పరిశీలిస్తూ, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు.జిల్లాలో మొత్తం 492 పనులకు రూ. 27.34 కోట్లు మంజూరు కాగా, ప్రస్తుతం 241 పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. కాలువల్లో పూడికతీత, అత్యవసర మరమ్మత్తులు, తూడు మరియు గుర్రపుడెక్క తొలగింపు పనులను వెంటనే పూర్తి చేసి, చివరి ఎకరం వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.గోదావరి డెల్టాకు ఈ నెల 31 నుంచే సాగునీరు విడుదల చేయనున్నట్లు ప్రకటించిన మంత్రి, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు.గత ఐదేళ్ల వైసిపి పాలనలో



కాలువల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి విమర్శించారు. సకాలంలో సాగునీరు అందక గోదావరి డెల్టా రైతులు నష్టపోయారని పేర్కొన్నారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గోదావరి డెల్టా ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, రూ.14 కోట్లతో లైడార్ సర్వే నిర్వహించి డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఆధునీకరణ పనులను త్వరలో ప్రారంభించి, 2028 జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. సమావేశంలో ఎస్ఇ దేవ ప్రకాష్, ఈ ఈ రమేష్ , డి ఈ ఈ లు వెంకటనారాయణ, ధర్మజ్యోతి, ఏఈలు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులు పరిశీలన**

పాలకొల్లు పట్టణంలో కోట్ల రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. 27వ వార్డులో క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్, ఎన్టీఆర్ కళాక్షేత్రం, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో సుందరీకరణ పనులను పరిశీలించి అధికారులు ఏజెన్సీలకు పలు సూచనలు ఇచ్చారు.

## నేడు జగ్గంపేటలో మెగా రక్త దాన శిబిరం కార్యక్రమం

**జగ్గంపేట,వజ్రభారతి,ప్రతినిధి,మే, 23:-** కాకినాడ జిల్లా: జగ్గంపేట గ్రామంలో ఆదివారం ఉదయం అంబేద్కర్ నగర్ లోని స్నేహ ఎంటర్ప్రైజెస్ ఆవరణంలో మెగా రక్తదాన శిబిర కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మరియు ఆదాని ఫౌండేషన్ వారిచే నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ఉత్సాహమైన యువతి యువకులు, వర్తక సోదరులు, రక్తందానం చేసి ఆపదలో ఉన్న జీవితాన్ని కాపాడాలని, రక్తదానం చేసి ప్రాణాన్ని కాపాడే మహా గొప్ప కార్యక్రమం నేడు జగ్గంపేటలో జరుగుతుందని, మరియు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తందానం చేసే దాతలకు రెడ్ క్రాస్ సొసైటీ వారిచే బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్ మరియు ఇన్సూరెన్స్ సర్టిఫికెట్, మరియు ఆదాని ఫౌండేషన్ వారిచే బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్ అందించడం జరుగుతుందని,ఈ కార్యక్రమానికి జగ్గంపేట స్థానిక ప్రజలు



సహోదరులు అందరూ రావాలని, శ్రీ స్నేహ ఎంటర్ప్రైజెస్ మరియు జగ్గంపేట ఛాంబర్ పాలకుర్తి సురేష్ తెలిపారు.

## పారాక్వాట్ కలుపు మందు అమ్మకాలు నిలుపుదల

### వ్యవసాయ అధికారి పి.గాంధీ



**శంఖవరం వజ్రభారతి ప్రతినిధి.ముఖీ.వీరబాబు మే :- 23 :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పారాక్వాట్ కలుపు మందు అమ్మకాలు నిలుపుదల చేయడం జరిగింది అని వ్యవసాయ అధికారి పి గాంధీ తెలిపారు.మండలంలోని పురుగు మందుల షాపులను తనిఖీ చేసి ఈ కలుపు మందు వల్ల మానవ ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదం,ప్రజా ఆరోగ్య భద్రతకు ముప్పు ఉన్నందున,అలాగే దీని విషప్రభావానికి విరుగుడు లేనందువల్ల ప్రస్తుతానికి ఈ కలుపు మందు అమ్మకశీ పై 60 రోజులపాటు మరియు తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు అమ్మకాలు నిలుపుదల చేయాలని వర్తకులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, ఈ ఆదేశాలు దిక్కరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ ఈ ఓ శ్రీనివాస్,వ్యవసాయ సహాయకులు మణికంఠ,జగదీశ్,క్రాంతి పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు మండలంలో ఏవో జోకా అమృత ఎరువుల దుకాణాల తనిఖీలు

### గడ్డి మందుపై తాత్కాలిక నిషేధం

### నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరిక



**ప్రత్తిపాడు,వజ్రభారతి,ప్రతినిధి,మే,23:-** ప్రత్తిపాడు మండలంలో ఉన్న ఎరువుల దుకాణాలను శనివారం ఏవో జోకా అమృత తనిఖీ చేశారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు జి.ఓ నెం.421 ప్రకారం ఈ తనిఖీలు నిర్వహించబడినట్లు మండల వ్యవసాయ అధికారిణి జోకా అమృత తెలిపారు.తనిఖీల సమయంలో ప్రత్యేకంగా గడ్డి మందులు (పారాక్వాట్ డైక్లోరైడ్ 24 శాతం ఎస్ఎల్) మరియు దాని అనుబంధ ఫార్ములేషన్స్‌పై పరిశీలన చేశారు.ప్రభుత్వ మార్గదర్శకాలు వచ్చే వరకు ఈ గడ్డి మందును తాత్కాలికంగా నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.దాదాపు 2615 లీటర్ల గడ్డి మందుపై 60 రోజుల పాటు తాత్కాలిక నిషేధం విధించబడింది.తదుపరి ప్రభుత్వ సూచనలు వచ్చే వరకు ఏ డీలర్ కూడా ఈ మందును విక్రయించకూడదని ఆమె స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అలాగే అన్ని ఎరువుల దుకాణాలకు స్టాప్ సేల్ ఆర్డర్ జారీ చేసారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### కోటనందూరు మండలంలో

## వృద్ధుడు అదృశ్యం....



**కోటనందూరు,మే 23, వజ్రభారతి:** కాకినాడ జిల్లా,కోటనందూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కే.ఈ. చిన్నయ్య పాలెం గ్రామానికి చెందిన కరక నూకరాజు, వయస్సు 68 సంలు, ఈ నెల 21-05-2026 తేదీన ఉదయం ఇంటి నుండి తోటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కోటనందూరు ఎస్సై టి రామకృష్ణ మిస్సింగ్ కేసు నమోదు చేశారు.కనిపించకుండా పోయిన వ్యక్తి సుమారు నాలుగున్నర అడుగుల ఎత్తు, చామనచాయ రంగులో ఉండి, వెళ్లేటప్పుడు గళ్ళ లుంగి, జబ్బల బాడీ, పింక్ కలర్ బనియన్, నాగలి తువ్వాలు ధరించి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.సదరు వ్యక్తి ఆచూకీ ఎవరికైనా తెలిసిన యెడల వెంటనే కోటనందూరు పోలీస్ స్టేషన్ లేదా ఎస్సై కోటనందూరు గారి మొబైల్ నెంబర్ 9440900773 కు సమాచారం అందించాలని ఎస్సై రామకృష్ణ తెలియజేశారు.

### దళిత మహిళలకు రక్షణ కల్పించడంలో

## కూటమి ప్రభుత్వం విఫలం

**పాయకరావుపేట ఘటనపై వైఎస్సార్సీపీ మహిళా నేత వర్ధినీడి సుజాత ఆగ్రహం**



**పిఠాపురం,వజ్రభారతి,ప్రతినిధి,మే, 23:-** పాయకరావుపేటలో దళిత బాలికపై జరిగిన లైంగిక దాడి ప్రయత్న ఘటన రాష్ట్రంలో దళిత మహిళల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని కాకినాడ జిల్లా వైఎస్సార్సీపీ మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత విమర్శించారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యంగా దళిత మహిళలు,బాలికలకు రక్షణ లేకుండా పోయిందని ఆమె ఆరోపించారు.హోంమంత్రి అనిత నియోజకవర్గమైన పాయకరావుపేటలో 11 ఏళ్ల దళిత బాలికపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడికి ప్రయత్నించిన ఘటన తీవ్రంగా కలచివేసిందన్నారు.సెల్‌ఫోన్ దొంగిలించిందని ఆరోపిస్తూ బాలికను ఈ నెల 17న కొబ్బరి తోటకు తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించడం అమానుషమని పేర్కొన్నారు.బాలిక ప్రైవేట్ భాగాలను తాకుతూ గోర్లతో గాయపరిచిన ఘటన అత్యంత హేయమైనదని అన్నారు.ఈ ఘటనపై బాలిక తల్లి ఫిర్యాదు చేసినప్పటికీ ప్రభుత్వం స్పందన కనిపించకపోవడం బాధాకరమన్నారు.ఒక దళిత మహిళ హోంమంత్రిగా ఉన్నప్పటికీ ఇలాంటి ఘటనలపై కనీస స్పందన లేకపోవడం దురదృష్టకరమని విమర్శించారు.తునిలో ఇటీవల జరిగిన ఘటనను గుర్తు చేస్తూ,రాష్ట్రంలో పిల్లలు,ముఖ్యంగా దళితులపై జరుగుతున్న దాడుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డికు దళితులు మద్దతుగా ఉన్నారనే కారణంతో వారిపై చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు.ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని బాధిత బాలికకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.



## అన్నవరంలో శ్రీ సత్యనారాయణ స్వామి ప్రాకార సేవ

**శంఖవరం వజ్రభారతి ప్రతినిధి. ముఖే. వీరబాబు మే :-23:** కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో శనివారం స్వామి అమ్మవార్ల తిరుచి సేవా ఘనంగా నిర్వహించారు ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయ అర్చకులు సుందరంగా అలంకరించి తిరుచి వాహనంపై ఆశీస్సులు గావించి వేద పండితుల మంత్రోచ్చారణ మంగళ వాయిద్యాల నడుమ తూర్పు రాజగోపురం చుట్టూ ప్రదర్శన గావించారు తిరుచి సేవా కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఐ వి రోహిత్ ఆలయ ఏఈఓ దామెర కృష్ణారావు వేద పండితులు ఆలయ అర్చకులు అధిక సంఖ్యలో భక్తులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు

## అన్నవరంలో నేడు వైసీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

### జయప్రదం చేయాలని ముద్రగడ గిరిబాబు పిలుపు




**శంఖవరం, వజ్రభారతి ప్రతినిధి. ముఖే.వీరబాబు మే :-23:** సమగ్ర ఓటర్ జాబితా సర్వేపై బూత్ స్థాయి ఏజెంట్లకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు తెలిపారు.ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు శంఖవరం మండలం అన్నవరం దేవస్థానం నర్సరీ గార్డెన్ ఎదురుగా ఉన్న కేకే ఫంక్షన్ హాల్లో ఈ సమావేశం జరుగనుంది.ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని గిరిబాబు పిలుపునిచ్చారు.బూత్ లెవెల్ ఏజెంట్లు సమగ్ర ఓటర్ జాబితా సర్వేపై పూర్తి అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతోనే ఈ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా,జిల్లా పరిశీలకులు దాట్ల సూర్యనారాయణ రాజు,ఎస్ఐఆర్ టాస్క్ ఫోర్స్ సభ్యులు బి వి ఆర్ చౌదరి,ఒమ్మి రఘురామ్,వాసిరెడ్డి జమీల్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.బూత్ లెవెల్ ఏజెంట్లు,గ్రామ అధ్యక్షులు,గ్రామ ముఖ్య నాయకులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు,ముఖ్య కార్యకర్తలు తప్పనిసరిగా హాజరై ఈ సమావేశంలో ఇచ్చే సమాచారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టిన ఎస్సై పి, నరేష్



**తుగ్గలి మే 23 (వజ్ర భారతి న్యూస్):** తుగ్గలి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతి వాహనదారుడు నియమ నిబంధనలతో పాటు ఆర్సి హెల్మెట్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. శనివారం మండల కేంద్రమైన తుగ్గలి లోని గుత్తి, పత్తికొండ, గుంతకల్లు, కూడలిలో వాహన తనిఖీలు చేపట్టారు. అందులో లైసెన్స్, హెల్మెట్, అర్.సి, లేనివారికి జరిమానా వేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ టు వీలర్ వారు హెల్మెట్ ధరించాలని త్రీ వీలర్ వారు యూనిఫామ్ కలిగి ఉండాలని ఫోర్ వీలర్ వారు ఆర్ సి లైసెన్స్ తో పాటు సీట్ బెల్ట్ ను వాడాలని వాహనదారులకు తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి వారిపై తగిన చర్యలు తీసుకొన బడునని హెచ్చరించారు.

## ఎమ్మిగనూరులో బహిరంగ జంతు బలుల నిషేధానికి అధికారులకి విహెచ్పి వినతి



**ఎమ్మిగనూరు మే 23,వజ్రభారతి ( కర్నూల్ జిల్లా ఇంచార్జి పద్మావతి ) :** బక్రీద్ పండుగ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో జంతు బలులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మిగనూరు డీఎస్పీ, పట్టణ, రూరల్ సీఐలు, తహశీల్దార్లను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. పండుగ సమయంలో శాంతిభద్రతలు కాపాడాలని, చట్టవిరుద్ధంగా బహిరంగంగా జంతువులను వధించకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను కోరారు.

# మంత్రిగారు వ్యక్తిగత విమర్శలు మానుకోండి-మేక శేషుబాబు మాజీ ఎమ్మెల్సీ

**పాలకొల్లు. (వజ్ర భారతి.) న్యూస్ మే 23:.** వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు ఏర్పాటుచేసిన విలేకరులు సమావేశంలో మాట్లాడుతూ....మంత్రి నిమ్మల రామానాయుడు ప్రెస్టేషన్లో కొన్ని వ్యక్తిగత విమర్శలు చేయడం జరిగింది.దమ్ముంటే రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ వ్యక్తిగత విమర్శలు తగదని ఆయన అన్నారు.మంత్రి రామానాయుడు నామీద వ్యక్తిగత విమర్శలు చేశారు.నేను ఎప్పుడు రాజకీయంగా ఎదుర్కొన్నాను తప్ప వ్యక్తిగత విమర్శలు చేయలేదు.రామానాయుడు మతిభ్రమించి మాట్లాడటం జరిగింది. నా గురించి నా రాజకీయ ప్రస్థానం గురించి మాట్లాడటం జరిగింది. ఆయన గతంలో కాంగ్రెస్ పార్టీలో కొనసాగడం కాంగ్రెస్ పార్టీలో ఎంపీపీ, జడ్పిటిసి ఇవ్వలేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జి ఆశీస్సులతో తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది.ఎవరి ఆశీస్సులతో అయితే పార్టీలో చేరారో వారినే మెడ పట్టుకుని బయటికి గెంటేసిన చరిత్ర మీది కాదా రామానాయుడు. రెండుసార్లు ఎమ్మెల్సీ చేసిన అంగర రామ్మోహన్ రావు ను తొక్కేసే విధంగా ఆయన గ్రామంలో ఆయన మొక్కలు నాటుకోవడానికి లేదు ఆయన ఫ్లెక్సీ ఆయన పెట్టుకోవడానికి లేదు. తెలుగుదేశంలో పార్టీలో పుట్టి ముందు నుంచి తెలుగుదేశం పార్టీ వ్యక్తి. మీరుముందు నుంచి ఉన్న తెలుగుదేశం క్యాడర్ ని



తొక్కేసి ఒక నియంతృత్వం ధోరణిలో చేసిన రాజకీయం పాలకొల్లు నియోజకవర్గం ప్రజలందరికీ తెలుసు అని ఆయన అన్నారు. గతంలో గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీగా పోటీ చేశారు 2 లక్షలు ఓట్ల ఉన్న ఎమ్మెల్సీకి మీకు కేవలం 1500 ఓట్లు మాత్రమే వచ్చాయి. గుర్తుంచుకోండి రామానాయుడు నేను మంత్రినీ ఏది మాట్లాడిన చెల్లుతుంది అని అనుకోవడం మీ తప్పు.ఏదైనా ఉంటే చర్చకు రా సిద్ధంగా ఉన్నాము.నువ్వు ఎక్కడకు పిలిచిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మేము సిద్ధంగా ఉన్నాం. మంత్రి రామానాయుడు రాజకీయాలకు రాకముందు అతని వ్యాపారం వడ్డీ వ్యాపారం, సూర్య చిట్ ఫండ్స్ ద్వారా15 సంవత్సరాలు ఆస్తులు మీద, పొలాల మీద అప్పులు ఇచ్చి ప్రజలను ముక్కు పిండి 10, 15 రూపాయలు వడ్డీలు వసూలు చేసి రోడ్లపై కొట్టుకున్న రోజులు మర్చిపోయావా రామానాయుడు అని ప్రశ్నించారు.నీ వడ్డీ వ్యాపారాన్ని తప్పులను మాఫీ చేసుకోవడం కోసం ఒక ఫౌండేషన్ పెట్టుకున్నావు తప్పులేదు, ఫౌండేషన్ పెట్టుకో నీ పాపాలను కడిగేసుకోవడానికి నువ్వు చేసిన తప్పులను కప్పి పంచుకోవడానికి ఫౌండేషన్ పెట్టవు అన్నారు.పాలకొల్లు ఎమ్మెల్యేగా 3సార్లు గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యే అంటున్నారు కదా ఒక పరిశ్రమ అయినా తీసుకొచ్చావా, పదిమందికి ఉపాధి కల్పించావా, ఎంతోమంది బెంగళూరు, హైదరాబాద్ ఇతర రాష్ట్రాలకు వెళ్లి 10, వేలు, 20 వేలు జీతాలకు ఉద్యోగాలు చేసుకుంటున్నారు నువ్వు మూడుసార్లు గెలిచి ఇక్కడ ప్రజలకు ఏం చేశావు రామానాయుడు అని ప్రశ్నించారు.జగన్మోహన్ రెడ్డి 475 కోట్లతో మెడికల్ కాలేజ్ తీసుకొస్తే దానికి అడ్డుపడ్డవు మెడికల్ కాలేజ్ వస్తే 10, వేలు నుంచి 15వేలు మందికి ఉపాధి వచ్చేది. దాన్ని కూడా అడ్డుకొని పాలకొల్లు ప్రజలను మోసం చేశావు.మీ ఇంటికి డ్రెయిన్ నేను కట్టాను, రోడ్డు నేను వేసాను.నువ్వు నన్ను అగర్తిపాలెం గ్రామానికి ఫ్యాక్టరీ తెచ్చి గిఫ్ట్ గా ఇచ్చావు అంటున్నావు.నేను ఎంతమందికి ఉపాధి కల్పించాను ఫ్యాక్టరీ పెట్టి అని అన్నారు.

## మహిళల భద్రతపై గుండాల్ తాండలో ఎస్సై, ఎన్, సి,మల్లికార్జున అవగాహన కార్యక్రమం

**తుగ్గలి మే 23 (వజ్ర భారతి న్యూస్):** తుగ్గలి మండలం జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో గుండాల తాండలో మహిళలపై జరుగుతున్న నేరాల నివారణ మరియు మహిళల భద్రతా చర్యలపై గుండాల్ తాండ లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల పై నేరాల నివారణ కు అవగాహన కల్పించేందుకు జొన్నగిరి ఎస్సై ,ఎన్ ,సి ,మల్లికార్జున మాట్లాడుతూ... మహిళల రక్షణ కోసం పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారన్నారు. సమస్యల విషయం లో సంకోచం లేకుండా పోలీసులను సంప్రదించాలని మహిళలకు పిలుపునిచ్చారు. చట్టాల పై అవగాహన పెరిగితే నేరాలు తగ్గుతాయన్నారు. మహిళలకు ఓటు హక్కు ఆస్తిలో సమాన భాగ హక్కులు ఇచ్చారన్నారు. పోక్సో చట్టం, బాల్య వివాహాల చట్టం, నిర్భయ చట్టాలు ఉన్నాయన్నారు. పని ప్రదేశంలో, సమాజంలో ఎమైనా మహిళల పై అఘాయిత్యాలు జరిగినప్పుడు పోలీసు స్టేషన్ కి వచ్చి ఫిర్యాదులు చేయాలన్నారు.ఎలాంటి భయాలు లేకుండా పోలీస్ స్టేషన్ కి వచ్చి ఫిర్యాదులు చేస్తనే చట్టాలు ఉపయోగపడతాయన్నారు. మహిళల భద్రత మనందరి భాధ్యత అన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు జిల్లా



పోలీసు శాఖ గట్టి చర్యలు చేపట్టిందన్నారు. పోలీసుస్టేషన్ కు రాకుండా మహిళల రక్షణ కవచం వంటి శక్తి యాప్ ఆధునిక సాంకేతిక సదుపాయాలను మహిళలు వినియోగించుకోవాలన్నారు.ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ఈ యాప్ ద్వారా వెంటనే సహాయం పొందవచ్చని, మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. మహిళలు ఎటువంటి వేధింపులు ఎదుర్కొన్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అత్యవసర సహాయం కోసం డయల్ 112, 181, 1098, 1930 హెల్ప్ లైన్ నంబర్లను వినియోగించాలన్నారు మహిళలు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఆపద సమయంలో భయం వీడి పోలీసులను సంప్రదించాలని కోరారు. వేధింపులు జరిగినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్ మరియు ఇతర భద్రతా చర్యలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినా, మహిళలకు సమస్యలున్నా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాల పై అవగాహన కలిగి ఉండాలన్నారు.



## ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం కావాలి-ఏవో సుధా మాధురి

### ఎల్‌నినో ప్రభావంపై అవగాహన..

### గడ్డి మందుపై స్టాప్ సేల్ చర్యలు



**కిర్లంపూడి,వజ్రభారతి,ప్రతినిధి, జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్, మే, 23:-** కిర్లంపూడి మండలంలోని ముక్కొల్లు,రాజుపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్ సాగు సమాయత్త కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏవో సుధా మాధురి రైతులకు పలు సూచనలు చేశారు.ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.నీరు విడుదలైన వెంటనే దమ్ములు సిద్ధం చేసుకుని,ఆకు మడులు వేసుకోవాలని రైతులకు సూచించారు.ఈ సార్వా సీజన్‌లో వెదజల్లు విధానానికి బదులుగా ఎంటీయూ పద్ధతిలో సాగు చేయాలని,నారుమడులు వేసుకుని సాగు ప్రారంభించాలని సూచించారు.రైతులు ఎంటీయూ-1318, బిపీటీ-3085,స్వర్ణ,సంపద స్వర్ణ వంటి దీర్ఘకాలిక,మధ్యస్థ రకాల వంగడాలను సాగు చేయాలని తెలిపారు.రైతులకు అవసరమైన ఎరువులు యాప్ ద్వారా అందుబాటులో ఉంచుతున్నామని,రైతు కార్డు ద్వారా సకాలంలో ఎరువులు పొందాలని కోరారు.అలాగే పంట కోత అనంతరం పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించారు.అలాగే మండలంలోని పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేసి, పారాక్వాట్ డైక్లోరైడ్ ఎస్ఎల్ మందు నిల్వ ఉంచిన దుకాణాలకు స్టాప్ సేల్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మొత్తం 475 లీటర్ల మందుపై స్టాప్ సేల్ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ ఆకుల సురేష్,వీఏఏ వర్మ,దేవి తదితరులు పాల్గొన్నారు.



## ఎన్ సి సి క్యాడెట్లకు రోడ్డు భద్రత మరియు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

**కాకినాడ,వజ్రభారతి,ప్రతినిధి,మే,23:-** కాకినాడ జేఎన్టీయూకే అల్యూమినియం స్టేడియం నందు ఎన్ సి సి క్యాడెట్లకు మరియు విద్యార్థిని విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్,రోడ్డు భద్రత మరియు సైబర్ నేరాలపై డిజిటల్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాద బాధితులకు అందిస్తున్న నగదు రహిత (ఉచిత) వైద్య చికిత్స విధానం గురించి వివరించారు.ప్రమాదం జరిగిన తేదీ నుండి ఏడు రోజుల్లోగా రూ.1,50,000 వరకు ఉచిత చికిత్స అందుబాటులో ఉంటుందని తెలిపారు.వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి అని సూచించారు.అలాగే ట్రిపుల్ రైడింగ్,బైక్ స్టంట్స్,మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు.జీబ్రా లైన్లు లేని చోట రోడ్డు దాటే విధానం,ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రాముఖ్యత,ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించరాదని వివరించారు.మహిళల భద్రత,ఈవ్ టీజింగ్ వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు.సైబర్ నేరాలపై భాగంగా ఆన్‌లైన్ మోసాలు,ఫేక్ లోన్ యాప్స్ మోసాలు,ఆన్‌లైన్ ఉద్యోగ మోసాలు,డిజిటల్ అరెస్ట్ మోసాలు వంటి వాటిపై విద్యార్థులకు వివరించారు.అత్యవసర నంబర్లు 112, 1930, 1972 వినియోగం గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ ఎన్. రమేష్, ఎన్ సి సి గ్రూప్ కెప్టెన్ పి ప్రవీణ్ బాబు,ఎస్సై సత్యనారాయణ మరియు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.





## ఏలేశ్వరంలో పాఠ్య పుస్తకాల స్టాక్ పాయింట్ పరిశీలించిన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

**ఏలేశ్వరం,వజ్రభారతి,ప్రతినిధి,మే,23:-** 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థుల పాఠ్య పుస్తకాల స్టాక్ పాయింట్‌ను ఏలేశ్వరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు.ఈ స్టాక్ పాయింట్‌ను ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రక్రియను సమయానికి పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.విద్యార్థుల అవసరాలు సమయానికి చేరేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు.పాఠశాల ప్రారంభం కాగానే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు.అదేవిధంగా యూనిఫాంలు,షూలు కూడా పాఠశాల ప్రారంభానికి ముందే అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈవో 2 వెల్లడించారు.

## జంతువుల సంరక్షణ చట్టాల అమలుకు కడప జిల్లాకు నోడల్ అధికారి నియామకం

### జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



**(వజ్రభారతి,ప్రతినిధి,కడపజిల్లా,బ్యూరో,మే 23:-):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హై కోర్టు ఉత్తర్వుల మేరకు, ఆంధ్ర ప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్ మరియు చీఫ్ ఆఫీస్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం, జిల్లాలో గోవధ మరియు జంతుబలులు నిషేధమని జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పీ.ఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే ఆంధ్రప్రదేశ్ గోవధ మరియు జంతుబలుల నిషేద చట్టం 1977 ప్రకారం శిక్షార్హులని హెచ్చరించారు. భారతదేశంలో గోవధ మరియు జంతుబలులు నిషేధమని, చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని, హెచ్చరించారు. జంతువుల సంరక్షణ చట్టాల అమలు సక్రమంగా జరగడానికి ఇన్స్పెక్టర్ టి.రెడ్డెప్ప ను కడప జిల్లా స్థాయి నోడల్ అధికారి గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.జంతువుల అక్రమ రవాణా మరియు అక్రమ వధ విషయంలో ప్రజలకు ఏవిధమైన సమాచారము ఉన్న యెడల ప్రత్యక్షంగా గానీ లేదా ఫోన్ ద్వారా జిల్లా స్థాయి నోడల్ అధికారి అయిన ఇన్స్పెక్టర్ టి.రెడ్డెప్పకు నియమించిన ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 9121100689 కు పిర్యాదు చేయగలరని, కడప జిల్లా ఎస్పీ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.


## ఉపాధి శ్రామికులకు రెండో రోజు మజ్జిగ పంపిణీ చేసిన టీడీపి నేత మిరియాల శ్రీను



**ప్రత్తిపాడు,వజ్రభారతి,ప్రతినిధి,మే,23:-** ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సూచనలతో ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడి గ్రామంలో ఉపాధి శ్రామికులకు టిడిపి సీనియర్ నాయకులు,మండల మాజీ ప్రతిపక్ష నేత మిరియాల శ్రీను ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.ఉదయం ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పనుల వద్ద ఉన్న కూలీలకు మజ్జిగ అందించడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.అలాగే వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో కూలీలకు వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించారు.రక్తపోటు (బీపీ), షుగర్ వంటి ప్రాథమిక వైద్య పరీక్షలు కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మిరియాల వెంకటరాజు,రామిశెట్టి శ్రీను,బద్దేటి వెంకట్రావు,ఏపూరి తిరపతయ్య,దువ్వా గంగబాబు,కాశపు బుచ్చయ్య,గంధం కొండమ్మ,గవిరెడ్డి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.గ్రామ పెద్దలు మరియు ఉపాధి హామీ కూలీలు కూడా హాజరయ్యారు.వేసవి తీవ్రతలో కూలీల ఆరోగ్య పరిరక్షణకు ఈ కార్యక్రమం చేపట్టిన మిరియాల శ్రీనుని పలువురు అభినందించారు.

## నూతన చిత్ర ప్రారంభోత్సవం

పాలకొల్లు, (వజ్ర భారతి) న్యూస్ మే 23: కలలా ఉంది ఈ క్షణం అనే నూతన చిత్రాన్ని ఉల్లంపర్రు మాంటిసోరి ఫంక్షన్ హాల్ నందు ఎస్ బి వి ఏ ప్రొడక్షన్స్ బ్యానర్ పై పూజా కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు వెంకీ మీ సరపు మాట్లాడుతూ మంచి వైవిధ్యం గల కొత్త తరహా కథతో చిత్రాన్ని తరికె ఎక్కిస్తున్నామని, ఈ చిత్రాన్ని షూటింగ్ మొత్తం పాలకొల్లు నరసాపురం భీమవరం ప్రాంతాల్లో చిత్రీకరణ ఉంటుందని తెలిపారు, రెండు షెడ్యూలలో పూర్తి చేస్తామని కొత్త నటీనటులు తోపాటు జబర్దస్త్ ఆర్టిస్టులు, సీనియర్ నటులతో ఈ చిత్ర తారాగణం ఉంటుందన్నారు, నిర్మాతలుగా వెంకటేష్ ,హేమంత్ ఇరువురు మాట్లాడుతూ ఖర్చుకు రాజీ పడకుండా చిత్రాన్ని తెరకెక్కిస్తామని ఇందులో నాలుగు పాటలు ఉంటాయని, మ్యూజిక్ ఎస్ కే సలీం సారథ్యంలో ఉంటుందన్నారు, దర్శకుడు గతంలో సత్యం, రణం, వీర గమనం వంటి చిత్రానికి దర్శకత్వం వహించి పలువురు ప్రశంసలు పొందానని చెప్పారు, చిత్ర హీరో నారాయణ మూర్తిరాజు, హీరోహిన్ జై శ్రీ ఉష ప్రధాన పాత్రలో నటిస్తున్నారు,




## ఘనంగా జిల్లా స్థాయి బాలల పార్లమెంట్ సమావేశం

# నిర్వహించిన గుడ్ షెఫర్డ్ సిస్టర్స్




**తాడేపల్లి,వజ్రభారతి,ప్రతినిధి,మే,23:-** డోలాస్ నగర్ నందు గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సిస్టర్ విద్యా ఆధ్వర్యంలో,జిల్లా స్థాయి బాలల పార్లమెంట్ సమైక్య ఏర్పాటు చేయడం జరిగింది మంగళగిరి, తుళ్ళూరు, పెదకాకాని, అమరావతి, తెనాలి, చేబ్రోలు, తాడికొండ, మండలాల నుండి వచ్చిన మండల స్థాయి బాలల పార్లమెంట్ మంత్రులను జిల్లా స్థాయి సమాఖ్యగ ఎన్నుకోవడం జరగింది,ఎన్నుకోబడ్డ జిల్లా సమైక్య సభ్యులు, ఏడు మండలాల లోని పిల్లల యొక్క సమస్యలను గుర్తించి, జిల్లా స్థాయి ప్రభుత్వ అధికారులుకు ఫిర్యాధు చేసి సమస్యలను ప్రభుత్వ అధికారుల సహాయ సహకారాలతో సమస్యలను పరిష్కరించుకుంటారు, ఈ కార్యక్రమంలో క్రాఫ్ డైరెక్టర్ డా:ఫ్రాన్సిస్ తంబి మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ లెవెల్ ఫెడరేషన్ ఎలా ఏర్పాటు చేయాలి, జిల్లా స్థాయి బాలల పార్లమెంట్ సమైక్య అంటే ఏమిటి, జిల్లాలోని వివిధ గ్రామాలు, మండలాల నుండి వచ్చిన బాలల పార్లమెంట్ నాయకులు ఏర్పాటు చేసుకునే ఒక సమష్టి వేదికనే జిల్లా స్థాయి బాలల పార్లమెంట్ సమైక్య అంటారు ఈ సమైక్య ద్వారా బాలలు తమ సమస్యలు అవసరాలు హక్కులు మరియు అభిప్రాయాలను జిల్లా స్థాయి లోని ప్రభుత్వ అధికారులకు నాయకులకు సమాజానికి తెలియజేయడమే ఈ విధంగా ఉన్న బాలలు ధైర్యంగా మాట్లాడగలగాలి, జిల్లా స్థాయి బాలల సమైక్య అవసరం ఏమిటి గ్రామ స్థాయిలోని సమస్యలను, జిల్లా స్థాయిలోనికి తీసుకుని బాలల హక్కుల పరిరక్షణకు బలమైన వేదిక,జిల్లా స్థాయి బాలల పార్లమెంట్ ముఖ్య ఉద్దేశ్యాలు బాలల హక్కుల పరిరక్షణ ప్రతి బాలిక బాలుడు సురక్షితంగా గౌరవంగా జీవించేలా చూడడం బాలల జిల్లా స్థాయి బాలల పార్లమెంట్ సమైక్య బాలలకు అవగాహన కల్పించడం జరిగింది అనంతరం, బుల్లా విజయ్ రాఘవ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు నందిగామ మాట్లాడుతూ బాలలకు చిన్నతనం నుండే సామజిక పరమైన అంశాలు పైనా అవగాహన కల్పిస్తూ వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్నదుకు చాలా సంతోషంగా ఉందని వ్యక్త పరిచినారు జిల్లా స్థాయి బాలల పార్లమెంట్ సమైక్య ఏర్పాటు అవ్వడం చాలా అభినందనీయం అని వారికి శు భాకాంక్షలు తెలిచేశారు,ఈ యొక్క కార్యక్రమంలో వివిధ మండలాల నుండి విచ్చేసిన, స్వచ్ఛంద సేవా సంస్థలు క్రాఫ్, జె యం జె, గమన, అమరావతి గుడ్ షెఫర్డ్, మంగళగిరి గుడ్ షెఫర్డ్, సుపీరియర్ సిస్టర్ మెర్సీ జార్జ్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ నుండి చైల్డ్ లైన్ సిబ్బందిజి. కోటేశ్వరరావు,చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సిస్టర్ విద్యా, తుళ్ళూరు, మంగళగిరి, పెదకాకాని, అమరావతి, తెనాలి, తాడేపల్లి,మండలాల నుండి బాలబాలికలు, మరియు గుడ్ షెఫర్డ్ సిబ్బంది, మీడియా ప్రతినిధి, టి .నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ శానిటేషన్ ప్రతి గ్రామంలో నిర్వహించాలి

### తాగునీటి సమస్యపై అధికారులు దృష్టి సారించాలి

### ప్రజలనుంచి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు వహించాలి

### ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశం

### వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే వీడియో కాన్ఫరెన్స్



తణుకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో రెండో దశ సూపర్ శానిటేషన్ కార్యక్రమాన్ని తప్పకుండా నిర్వహించి ప్రజల నుండి ఫిర్యాదులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. శనివారం మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ అభివృద్ధి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఈ మేరకు పలు సూచనలు చేశారు. వేసవి కాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటిపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలని కోరారు. అత్తిలి మండలం మంచిలి గ్రామంలో తాగునీటి సమస్యపై ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అత్తిలి గ్రామంలో రెండు పూటలా తాగునీరు సరఫరా చేయాలని కోరారు. తణుకు మండలంతో గ్రామాల్లో తాగునీటి సమస్యపై కొన్ని ప్రాంతాల్లో వాటర్ ట్యాంకు ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. ఇరగవరం మండలంలో కుళాయిల సమస్యను పరిష్కరించి వేసవికాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాల్లో నూరు శాతం బహిరంగ మలవిసర్జన జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వీధి దీపాలు నూరు శాతం అన్నిచోట్ల పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛరథం గురించి అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. రాబోయే వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మేజర్ గ్రామపంచాయతీలలో ప్రధాన డ్రైనేజీల్లో సిల్టు తొలగించేందుకు ప్రణాళికలు చేయాలని సూచించారు. ప్రతి మండలంలో పెన్షన్ ఇచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాధాకృష్ణ పేర్కొన్నారు.

## బాల్యవివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీలను నివారించాలి... కలెక్టర్ సిరి



**కర్నూల్ మే 23, వజ్రభారతి (జిల్లా ఇంచార్జి పద్మావతి ) :** నంద్యాల జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీ, బాల్య వివాహాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్లో టీనేజ్ ప్రెగ్నెన్సీ, బాల్య వివాహాల నివారణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. టీనేజీ ప్రెగ్నెన్సీలు నమోదు కాకుండా చైతన్యం తీసుకొచ్చేలా కళాజాత బృందాలను ఏర్పాటు చేసి, అవగాహన కల్పించాలన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన, ఏపీఓ



**వజ్ర భారతి, కుక్కునూరు, మే 23:** కుక్కునూరు మండలంలోని ఉప్పేరు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఏపీఓ మాధవరావు శని వారం పరిశీలించారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా కూలీలు చేసిన పనులకు సంబంధించిన కొలతలను పరిశీలించారు. ఏపీఓ మాట్లాడుతూ. ఎండాకాలం కావున ఉపాధి హామీ కూలీలు ఉదయం తొందరగా రావాలని, ఎండలు ముదురుతున్న కొద్ది పనుల వద్ద జాగ్రత్తలు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అలాగే పని ప్రదేశంలో నీటి సౌకర్యం కూడా కల్పించాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, మేటి లు,కూలీలు పాల్గొన్నారు.

## పాలీసెట్ ఎంట్రన్స్ లో... విశ్వశాంతి విద్యార్థి స్టేట్ ఫస్ట్

### 120/120 మార్కులతో రాష్ట్ర అర్ఫజ్ కు రాష్ట్ర ప్రథమ స్థానం.

### సత్తుపల్లి చరిత్రలో ఇదే మొదటిసారి.

### స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన అర్పాజ్ అలీ.

సత్తుపల్లి మే 23 (వజ్రభారతి తెలుగు దినపత్రిక ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి ఈనెల 13వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పాలీసెట్ ఎంట్రెన్స్ ఫలితాలు శనివారం వెలుపడ్డాయి.సత్తుపల్లిలో విశ్వశాంతి విద్యాలయం విద్యార్థి ఎండి. అర్పజ్ అలీ 120/120 మార్కులతో రాష్ట్ర స్థాయిలోప్రథమ స్థానం సాధించాడు.పాలీసెట్ ఎంట్రన్స్ లో సత్తుపల్లి కి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ లభించడం ఇదే మొదటిసారి.ఈ విద్యార్థి ఎంపీసీలో 30 / 30, ఫిజిక్స్ లో 30 / 30, గణితంలో 30 /30, కెమిస్ట్రీలో 30/30 మార్కులు ( మొత్తం 120/120) సాధించాడు. ఈ సందర్భంగా అర్ఫాజ్ ను సత్తుపల్లి ఎంఈవో రాజేశ్వరరావు అభినదించారు. అర్ఫాజ్ మాట్లాడుతూ... సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, ఉపాధ్యాయుల సూచనలను పాటిస్తూ, తల్లిదండ్రలను గౌరవిస్తూ చదువుకోవడం వలన తనకు ఈ విజయం సాధ్యపడిందని ఈ సందర్భంగా అర్ఫజ్ అన్నారు. అర్ఫాజ్ తండ్రి అఫ్జల్ జర్నలిస్ట్. పోటి పరీక్షలకు ప్రోత్సహించడం...విశ్వశాంతి విద్యాలయం



ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ... మార్కులు, ర్యాంకులు మాత్రమే ధ్యేయంగా కాకుండా తమ విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించేందుకు ప్రోత్సహించడం , విషయం పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.వారు చదువులో రాణించేందుకు ప్రణాళిక బద్దంగా విద్యాబోధన చేయడంతో పాటు ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ చూపడం జరుగుతుందన్నారు.ఈ ప్రాంతంలో ఎక్కడ పోటీ పరీక్ష నిర్వహించినా తమ విద్యార్థులు పాల్గొనేటట్లుచేయడం జరుగుతుందని అన్నారు. ఫలితంగా పాల్గొన్న ప్రతి పరీక్షలో ఆశించిన ఫలితాలు లభిస్తున్నాయని అన్నారు. విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేస్తున్నారు. పాఠశాల యాజమాన్యం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ విద్యార్థిని అభినందించారు.

## వెంకటేశ్వర స్వామిని మామిడి పండ్లు తో అలంకరణ చేసిన భక్తులు. ...



**పెనుమంట్ర, వజ్రభారతి, మే, 23:** మార్టేరు లో ని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలోశ్రీ వెంకటేశ్వర స్వామి వారు మామిడి పళ్ళు అలంకరణలో శనివారం తెల్లవారుజాము నుండి భక్తుల కు దర్శనం ఇచ్చారు. స్వామి వారికి ఎంతో ఇష్టమైన శనివారం సుప్రభాత సేవతో మొదలై భక్తులు పెద్ద ఎత్తున దర్శనం చేసుకున్నారని ఆలయ దేవస్థానం చైర్మన్ చినబాబు తెలిపారు. అలాగే ఈ అలంకరణకు మామిడిపళ్ళు ఇచ్చిన దాతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసినారు. అలాగే అలంకరణకు సహకరించిన కమిటీ సభ్యులకు భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించవలసిందిగా ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి శనివారం స్వామివారి సుప్రభాత సేవకు పెద్ద ఎత్తున భక్తులు వస్తున్నారని ఆయన తెలిపారు.

# రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి మరియు జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ మే 25న పశ్చిమ గోదావరి జిల్లా పర్యటన .

**పెనుమంట్ర /భీమవరం: వజ్రభారతి, మే, 23:** రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి మరియు జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ నెల 24 మరియు 25 తేదీలలో పశ్చిమ గోదావరి జిల్లాలో విస్తృత పర్యటన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. 24వ తేదీ ఆదివారం సాయంత్రం 7.00 గంటలకు తాడేపల్లి నివాసం నుండి బయలుదేరి రాత్రి 9.00 గంటలకు పశ్చిమ గోదావరి జిల్లా తణుకు చేరుకొని ప్రైవేట్ గెస్ట్ హౌస్‌లో రాత్రి బస చేస్తారు. 25వ తేదీ సోమవారం ఉదయం 9.30 గంటలకు తణుకు నుండి బయలుదేరి 10.00 గంటలకు పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరం గ్రామానికి చేరుకుంటారు. అక్కడ సచివాలయం మరియు వెల్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. తదుపరి 10.35 గంటలకు గరువు గ్రామానికి చేరుకొని రహదారుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అనంతరం 11.00 గంటలకు నౌదూరు సెంటర్ ప్రాంతానికి చేరుకొని నౌదూరు నుండి బ్రహ్మణ చెరువు వరకు నిర్మించిన రహదారిని ప్రారంభిస్తారు. 11.25 గంటలకు మార్టేరు గ్రామానికి చేరుకొని అచంట రోడ్డులోని ఎస్సీ/ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టును ప్రారంభిస్తారు. తర్వాత 11.50 గంటలకు పెనుగొండ గ్రామం మరియు మండలానికి చేరుకొని 132/33 కెవి సబ్‌స్టేషన్‌లో నూతన 50 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.20 గంటలకు వడలి గ్రామానికి చేరుకొని సుబ్బారాయుడు పుంత వద్ద నిర్మించిన డబ్ల్యూబీఎం రహదారిని ప్రారంభిస్తారు. అనంతరం మధ్యాహ్న భోజన విరామం కోసం కొమ్ముచిక్కల గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ నివాసానికి వెళ్తారు. మధ్యాహ్నం 2.00 గంటలకు అక్కడి నుండి బయలుదేరి సాయంత్రం 5.00 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారని జిల్లా సమాచార శాఖ ఆ ప్రకటనలో తెలిపింది.

# ఇస్నాపూర్ మున్సిపాలిటీలో మినీ స్టేడియం, పార్కులు ఏర్పాటు చేయాలి

## కమిషనర్ కు మెమొరండం సమర్పించిన...మెట్టు శ్రీధర్



**పటాన్ చెరువు, మే23వజ్ర భారతి న్యూస్, రాష్ట్ర బ్యూరో,(డా.ఏర్పుల శ్రీనివాస్):** సంగారెడ్డి జిల్లా పఠాన్ చెరువు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజా ప్రయోజనాల కొరకు మినీ స్టేడియం, పార్కులను ఏర్పాటు చేయాలని, నానాటికీ పెరిగిపోతున్న ప్రభుత్వ రోడ్ల ఆక్రమణలను అడ్డుకోవాలని, అలాగే తీవ్ర గందరగోళంగా మారిన కొత్త ఇండ్ల నంబర్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని నవభారత్ నిర్మాణ్ యువసేన అధ్యక్షుడు మరియు తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు. శనివారం రోజున ఆయన మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ వెంకట కిషన్ రావును కలిసి ఈ మేరకు ఒక సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మెట్టు శ్రీధర్ మాట్లాడుతూ ఇస్నాపూర్ మున్సిపాలిటీ శరవేగంగా విస్తరిస్తున్నప్పటికీ, స్థానిక యువతకు, విద్యార్థులకు క్రీడల్లో రాణించడానికి, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి కనీసం ఒక్క ఆట స్థలం లేదా మినీ స్టేడియం కూడా లేకపోవడం విచారకరమన్నారు. అదేవిధంగా వృద్ధులు, మహిళలు, పిల్లలు సాయంత్రం వేళల్లో మానసిక ఉల్లాసం కొరకు గడపడానికి, వ్యాయామం చేయడానికి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను గుర్తించి వెంటనే పార్కులను ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపాలిటీలో ఇంటి నెంబర్ల సమస్య వల్ల స్థానిక ప్రజలు ఆధార్ కార్డ్, ఓటర్ ఐడీ, కరెంట్ కనెక్షన్లు, వివిధ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునేటప్పుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని మండిపడ్డారు. ఈ ఇండ్ల నంబర్ల సమస్యను మున్సిపల్ రెవెన్యూ విభాగం తక్షణమే సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో కొంతమంది వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా,ఎలాంటి మున్సిపల్ అనుమతులు లేకుండా ప్రభుత్వ రోడ్లను, ఖాళీ స్థలాలను ఆక్రమించి అక్రమంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల రోడ్లు ఇరుకుగా మారి తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మున్సిపాలిటీ చట్టం ప్రకారం అధికారులు స్పందించి, తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి రోడ్లపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు.

# తణుకు పట్టణంలోని స్టార్ ప్రైవేట్ ఆసుపత్రిలో ఇటీవల జరిగిన బాలింత మృతి సంఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.జి.గీతాబాయ్ వివరాలు వెల్లడి

**భీమవరం: వజ్రభారతి, మే 23:** తణుకు పట్టణంలోని స్టార్ ప్రైవేట్ ఆసుపత్రిలో ఇటీవల జరిగిన బాలింత మృతి సంఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.జి.గీతాబాయ్ వివరాలు వెల్లడి. ఈ సంఘటనకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే సంబంధిత ప్రైవేట్ ఆసుపత్రిపై ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు డిఎంహెచ్వో తెలిపారు. తనిఖీలో భాగంగా ఆసుపత్రి రికార్డులు, చికిత్స విధానం, విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది నుండి వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు.

ప్రాథమిక విచారణలో మృతి చెందిన బాలింత బీహార్ రాష్ట్రానికి చెందిన యువతిగా గుర్తించినట్లు తెలిపారు. గర్భిణీ స్త్రీ మే 9, 2026న హైదరాబాద్‌లో స్కానింగ్ చేయించుకున్నట్లు, అనంతరం రాజమండ్రిలోని ఒక హోటల్‌లో ఉన్నట్లు సమాచారం లభించినట్లు చెప్పారు. అక్కడి నుండి పూర్తిస్థాయి గర్భధారణ కాలం నిండకముందే ఒక ఆర్.ఎం.పి డాక్టర్ సహకారంతో మే 16, 2026 రాత్రి తణుకులోని స్టార్ ప్రైవేట్ ఆసుపత్రికి



తీసుకువచ్చినట్లు తెలిసిందన్నారు. ఆసుపత్రికి వచ్చిన గంట వ్యవధిలోనే శస్త్రచికిత్స నిర్వహించి శిశువును బయటికి తీసిన అనంతరం, మే 17, 2026 ఉదయం బాలింత మృతి చెందినట్లు వెల్లడించారు. తదుపరి బంధువులు లేదా కుటుంబ సభ్యులు ఎవరూ ముందుకు రాకపోవడంతో తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల బృందంతో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహ అవశేషాలను భద్రపరిచినట్లు తెలిపారు. అలాగే నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం పంపించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తెలిపారు. ప్రాథమిక విచారణలో వైద్య ఆరోగ్య శాఖ రికార్డుల ప్రకారం స్టార్ ఆసుపత్రి గత మూడు సంవత్సరాలుగా మూసివేయబడినట్లుగా నమోదై ఉన్నప్పటికీ, అనధికారికంగా కొంతమంది ఆర్.ఎం.పి డాక్టర్ల సహకారంతో కేసులు స్వీకరించి వైద్య సేవలు అందిస్తున్నట్లు సమాచారం లభించినట్లు చెప్పారు. అయితే దీనికి సంబంధించిన పూర్తి ఆధారాల సేకరణ కొనసాగుతోందని పేర్కొన్నారు. వైద్య నిబంధనలు మరియు ప్రభుత్వ మార్గదర్శకాలు ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా గుర్తించినందున స్టార్ ఆసుపత్రిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆసుపత్రి యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. జి. గీతాబాయ్ తెలిపారు.

# కాజిపల్లి లో మళ్లీ రాజకీయం వేడి కౌన్సిలర్ సంధ్య సురేష్ పై గ్రామస్తుల ఆగ్రహం

## క్రషర్ వివాదం కొత్త మలుపు మీడియా ముందుకు వచ్చిన గ్రామ పెద్దలు

## తప్పులు చేసి నిందలు మాపై వేయొద్దు అరికెల సంధ్య సురేష్ పై గ్రామస్తుల విమర్శలు

**గడ్డపోతారం మున్సిపాలిటీ, మే 23వజ్ర భారతి న్యూస్, రిపోర్టర్ (జింక గణేష్):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాజీపల్లి గ్రామంలో రాజకీయ వివాదం మరోసారి వేడెక్కింది. ఎనిమిదో వార్డు కౌన్సిలర్ భర్త అరికెల సురేష్ వ్యవహార శైలిపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మైలారం భీమా, చిరుమని సురేష్, శాగ అశోక్ మాట్లాడుతూ పలు ఆరోపణలు చేశారు. ఇటీవల ఓ క్రషర్ యాజమాన్యం వద్దకు వెళ్లి అరికెల సురేష్ దురుసుగా ప్రవర్తించడమే కాకుండా డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై యాజమాన్యం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఎన్నికల్లో తనపై పోటీ చేసిన వారిపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎలాంటి ఆధారాలు లేకుండా పోలీసులు కేసులు నమోదు చేయరని, తప్పు చేసి ఇప్పుడు నిందలు ఇతరులపై మోపడం సరికాదన్నారు. గ్రామ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. రాజకీయ కక్షలతో ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు



కొనసాగితే తాము కూడా గట్టిగా సమాధానం ఇస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పర్వేద్ వీరాస్వామి,ఎండీ ఖాజా, చిరుమని చంద్రయ్య, చిట్ల మహేష్, చిరుమని శ్యామ్ బాబు, కొండా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల వేతనాలు చెల్లించాలని సి ఐ టి యు ఆధ్వర్యంలో దీక్ష

## జిన్నారం మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన

## జీవనోపాధి లేకనే మున్సిపల్ కార్మికులుగా పనిచేస్తున్నాం జీతాలు లేకుంటే ఎట్లా

## సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పి.నాగేశ్వరరావు నాయకులు కమ్మరి రవీందర్ చారి




**జిన్నారం మున్సిపల్, మే 23 వజ్ర భారతి న్యూస్,రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ కేంద్రంలో నెలల తరబడి జీతం రాక, జిన్నారం మున్సిపాలిటీ పారిశుద్ధ్యం కార్మికులు తీవ్ర అసహనంతో నిరసన వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. ఐదు నెలల తరబడిగా జీతాలు అందకపోవడంతో దిక్కులేని పరిస్థితుల్లో స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు శనివారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.నాగేశ్వరరావు జిల్లా నాయకులు కమ్మరి రవీందర్ చారి ఆధ్వర్యంలో టెంట్ వేసుకొని నిరసన వ్యక్తం చేస్తూ దీక్ష కార్యక్రమాన్ని సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డుపైనే వంట వార్పు కార్యక్రమానికి ఉపక్రమించారు. ధర్నా నిరసన దీక్ష శిబిరా నిర్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.నాగేశ్వరరావు,జిల్లా నాయకులు కమ్మరి రవీందర్ చారి లు మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా నిరుపేద మున్సిపల్ కార్మికుల వేతనాలు వేను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ముందు దీక్షకు కూర్చున్నారన్న విషయాన్ని అధికార యంత్రాంగం గుర్తించాలన్నారు. మున్సిపల్ జీవో ప్రకారం 21,000 చొప్పున వేతనాలు చెల్లించాలని వారు. డిమాండ్ చేశారు .ఆరు నెలల నుండి నిరుపేద కార్మికుల వేతనాలను చెల్లించకుండా రేపు మాపు అంటూ కాలయాపన చేస్తే వారి కుటుంబాల బతుకు చిత్రం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యా కార్యక్రమంలో సున్నం నర్సింలు, శ్రీశైలం, కృష్ణ, డప్పు సాలమ్మ, డబ్బు సంతోష, బాల నర్సమ్మ, శేఖర్, నర్సింలు, కృష్ణ, అర్జున్, కంసమ్మ, స్వరూప, తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# నర్సాపూర్ ప్రభుత్వఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన న్యాయమూర్తి

## రోగుల పట్ల వైద్య సేవలు అందిస్తూ అప్రమత్తంగా ఉండాలి

## రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టరీత్యా శిక్షించబడతారు ఎం. హేమలత

## జూనియర్ సివిల్ జడ్జ్, కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్

**మెదక్ జిల్లా,నర్సాపూర్, మే 23 వజ్ర భారతి న్యూస్, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (బి.మహేందర్):** మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని న్యాయమూర్తిఎం. హేమలత,ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మందుల లభ్యత, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహించడం, విధుల్లో అలసత్వం



ప్రదర్శించడం సహించబోమని హెచ్చరించారు. ప్రతి రోగికి సమానంగా వైద్య సేవలు అందేలా అప్రమత్తంగా పనిచేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, అత్యవసర సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



రోగుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

# బొంతపల్లి నల్లపోచమ్మ తల్లి ఆలయానికి సిజిఆర్ ఆర్థిక సహాయం

## ఆలయ అభివృద్ధికి రూ.1.50 లక్షల విరాళం

**గుమ్మడిదల మున్సిపాలిటీ, మే 23 వజ్ర భారతి న్యూస్:** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి శ్రీ నల్లపోచమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి (సిజిఆర్) శనివారం రూ.1.50 లక్షల విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులకు నగదును అందించిన



ఆయన, దేవాలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా సమాజ ఐక్యతకు, ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. నల్లపోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించిన సిజిఆర్, ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. ఆయన అందించిన విరాళంపై ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సురభి కుమార్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు వినోద్ గౌడ్, రమేష్ అప్ప, సుదర్శన్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అనాధ వికలాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలి

## శివంపేట్ మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించిన న్యాయమూర్తి ఎం. హేమలత

### జూనియర్ సివిల్ జడ్జ్, చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్

**మెదక్ జిల్లా నర్సాపూర్, మే 23వజ్ర భారతి న్యూస్, జిల్లా స్టాఫ్ రిపోర్టర్,(బి. మహేందర్):**మెదక్ జిల్లా నర్సాపూర్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో శివంపేట్ మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జ్, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ ఎం. హేమలత పాల్గొన్నారు.ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎం.హేమలత,మాట్లాడుతూ శివంపేట్, నర్సాపూర్ మండలాల పరిధిలోని అనాధ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాల నుంచి ప్రభుత్వ పింఛన్లు మంజూరు చేయించి అనాధ పిల్లలను, వృద్ధులను,ఆదుకోవాలని మండల్ లీగల్ సర్వీస్ కమిటీకి వినతిపత్రాలు అందాయని తెలిపారు. ఈ నేపథ్యంలో లీగల్ సర్వీస్ ద్వారా పీ.ఎల్.సి. నమోదు చేసి సంబంధిత మండల స్థాయి అధికారులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు.అనాధలు, వికలాంగులు, వృద్ధులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు,పింఛన్లు, ఆధార్ కార్డులు తదితర సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో శివంపేట్ మండల ఎంపీడీఓ ఎం.వి. లక్ష్మమ్మ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.సాయి



సౌమ్య, డిప్యూటీ తహసీల్దార్ ఆర్. నిరంజన్, తదితరులు పాల్గొన్నారు. అధికారులు స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# బీరంగూడ లో నూతన జ్యువలరీ షాప్ ప్రారంభం

### ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకుడు ఈర్ల రాజు

**అమీన్పూర్ మున్సిపల్, మే 23 వజ్ర భారతి న్యూస్:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని అమీన్పూర్ మండలం బీరంగూడ డివిజన్ పరిధిలో రాజస్థానీ వ్యాపారవేత్త బుద్ధారం మిత్రుడు నూతనంగా ఏర్పాటు చేసిన జ్యువెలరీ షాప్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ బీరంగూడ 270 డివిజన్ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీరంగూడ ప్రాంతంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న రాజస్థానీ మార్వాడి వ్యాపారవేత్తలకు ఎల్లప్పుడూ తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. వ్యాపార అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ ఎప్పటికీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. నూతనంగా ప్రారంభమైన జ్యువెలరీ షాప్ మంచి అభివృద్ధి సాధించి ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షిస్తూ షాప్ యజమాని బుద్ధారం మిత్రునికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజస్థానీ గేరు మండలి సభ్యులు, పండిత్ పరమేశ్వరరావు, మనోహర్, రతన్, రాకేష్, గోకుల్ సింగ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# జొన్న పంట కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా చేపడతాం

### నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**భైంసా,మే 23 వజ్ర భారతి న్యూస్, జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** భైంసా పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జొన్న పంట కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపడుతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.జొన్న పంట కొనుగోలు ప్రక్రియపై,జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా,ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జొన్న, మొక్కజొన్న పంట కొనుగోలు ప్రక్రియను ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేస్తామని అన్నారు. పంట అమ్మకం విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని వివరించారు. ఇప్పటివరకు ఏర్పాటు చేసిన మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పూర్తి చేసిన మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ, ఇంకా కొనుగోలు చేయాల్సిన మొక్కజొన్న పంట వివరాలను వివరించారు.ఎక్కడ కూడా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేశామని అన్నారు.సరిపడినంత మంది హమాలీలు, లారీల ద్వారా కొనుగోలు ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, పంటల అమ్మకంలో రైతులకు ఇబ్బందులు కలగకూడదని అన్నారు.పంట కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన పంటల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సరిపడినన్ని లారీలు, హమాలీలతో ఎప్పటికప్పుడు కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములకు తరలిస్తూ ఉండాలన్నారు. అధికారులు అంతా క్షేత్రస్థాయిలో పంటల కొనుగోలు విషయంలో పర్యవేక్షణ ఉంచాలని తెలిపారు.భైంసా డివిజన్ మండలాల వారిగా పంటల కొనుగోలు వివరాలను తహసిల్దార్లను అడిగి తెలుసుకున్నారు.ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షిండే ఆనంద్ రావు పటేల్, భైంసా డివిజన్ తహసిల్దార్లు,ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మూడు కోట్ల 66 లక్షల లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

అమీన్పూర్, మే 23 వజ్ర భారతి న్యూస్, రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్): సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ డివిజన్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీలు, విలీన గ్రామాలలో 3 కోట్ల 66 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన పటాన్చెరు సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి. శర వేగంగా అభివృద్ధి చెందుతున్న బీరంగూడ, అమీన్పూర్ డివిజన్ల పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఆయన తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకుల ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. హాజరైన మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



# జమ్ము కాశ్మీర్ కరాటే లో సత్తా చాటిన లోహిత్ మణి

## నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ లో ఎస్ ఎస్ కేఐ టీం ప్రతిభ అద్భుతం

## ఎస్ఎస్ కె ఐ, టీమ్ మెడల్స్ గోల్డ్ 7, సిల్వర్ 8, బ్రాంజ్ 9

## మాస్టర్ అనిల్ కుమార్ కు అభినందనలు

**పటాన్చెరు నియోజకవర్గం, మే 23 వజ్రభారతి న్యూస్:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని తెల్లాపూర్ డివిజన్ కు చెందిన జమ్మూ కశ్మీర్ లో నిర్వహించిన కరాటే ప్రీమియర్ లీగ్ నేషనల్ లెవల్ టోర్నమెంట్ లో ఎస్ఎస్ కె ఐ టీమ్ అద్భుత ప్రదర్శన చేసి ఘన విజయాన్ని నమోదు చేసింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారుల మధ్య జరిగిన ఈ పోటీల్లో ఎస్ఎస్ కె ఐటీమ్ క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపిస్తూ గోల్డ్ మెడల్ లోహిత్ కైవసం చేసుకున్నాడు ఈ విజయంతో గండిపేట్ పరిసర ప్రాంతాల్లో క్రీడాభిమానుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది.ఈ టోర్నమెంట్ లో ఎస్ఎస్ కె ఐ టీమ్ మొత్తం 7 గోల్డ్ మెడల్స్, 8 సిల్వర్ మెడల్స్, 9 బ్రాంజ్ మెడల్స్ సాధించి జాతీయ స్థాయిలో తమ స్థాయిని చాటింది. ప్రతి విభాగంలో క్రీడాకారులు ధైర్యంగా పోరాడి ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చారు. ముఖ్యంగా ఫైనల్ రౌండ్లలో చేసిన ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుం ది. ఈ విజయాల్లో ప్రత్యేకంగా తెల్లాపూర్ కు చెందిన లోహిత్ అద్భుతంగా రాణించి ఒక సిల్వరెమెడల్, ఒక బ్రాంజ్ మెడల్ సాధించడం విశేషం. చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించడం ద్వారా తన గ్రామానికి ప్రాంతానికి గర్వకారణంగా నిలిచాడు. లోహిత్ మణి ప్రదర్శనను చూసిన క్రీడా నిపుణులు అతడికి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఈ విజయానికి మార్గనిర్దేశం చేసిన మాస్టర్ అనిల్ కుమార్ పాత్ర ఎంతో కీల కమని క్రీడాకారులు తెలిపారు. ఆయన శిక్షణ, క్రమశిక్షణ, నిరంతర ప్రోత్సా హంతోనే ఈ ఘన విజయం సాధ్యమైం దని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ ఎస్.కె. ఐ టీమ్ సభ్యులకు, విజేతలకు స్థానిక క్రీడాభిమానులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలుపుతూ భవిష్యత్తు లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.





# ఇందిరమ్మ ఇళ్ళను త్వరితగతిన పూర్తి చేసుకోండి

### ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

### పర్యవేక్షణలో పాల్గొన్న గ్రామ సర్పంచ్, సెక్రటరీ అనూష

**ముధోల్, మే 23 వజ్ర భారతి న్యూస్,జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** నిర్మల్ జిల్లాలోని ముధోల్ మండలంలో విట్టోలి గ్రామ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ళను ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షించారు. బురుగుల



లలిత అనే లబ్ధి దారి ఇల్లును సందర్శించి నాణ్యతను పరీక్షించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్లను త్వరితగతి నా పూర్తి చేసుకోవాలని బిల్లుల విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని బిల్లుల విషయంలో ఎలాంటి భయాందోళనకు గురికావద్దని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విట్టోలి గ్రామ సర్పంచ్ కాలేవార్ దిగంబర్, గ్రామ సెక్రటరీ అనూష, హౌసింగ్ ఏఈ మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల వితరణ**

తెలంగాణలోని పలు జిల్లాల్లో ఎండలు తీవ్రతరం కావడంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఎండ దెబ్బ నుండి రక్షించుకోవడానికి పలు సూచనలు సూచించారు గ్రామ సెక్రెటరీ అనూష. ఈ సందర్భంగా ఆమె ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. వడదెబ్బ తగలకుండా కచ్చితంగా రోజు ఓ ఉపాధి హామీ కూలీకి పొద్దున 6 గంటలకు వచ్చి 10 గంటల లోపు పనులను పూర్తిచేసుకుని రెండో ఫోటో క్యాప్చర్ చేసుకొని వెళ్లాలని,ఇందులో భాగంగా ఫీల్డ్ అసిస్టెంట్లకు సహకరించాలని తెలియజేసారు.

# సీ.ఎం.రేవంత్ రెడ్డి మంత్రి వివేక్ వెంకటస్వామి చిత్రపటానికి పాలాభిషేకం

**మెదక్, మే 23 వజ్ర భారతి న్యూస్, జిల్లా స్టాఫ్ రిపోర్టర్(బి. మహేందర్):** తెలంగాణలో వివిధ విభాగాల కార్మికుల కనీస వేతనాలు భారీగా పెంచుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెరిగిన వేతనాలు జూన్ 2వ తేదీ నుంచి అమల్లోకి రానుండటంతో, మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని హత్నూర మండల్ గుండ్ల మాస్నూర్ పారిశ్రామిక అరబిందో యూనిట్ 9 వద్ద కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. కనీస వేతనాల పెంపు అమలు పెంచిన కనీస వేతనాలు జూన్ 2, 2026 నుంచి అమల్లోకి వస్తాయి.కేటగిరీలు: కార్మికులను నాలుగు కేటగిరీలుగా విభజించి ఈ వేతనాలను సవరించారు.ప్రకటన: చాలా కాలంగా ఉన్న డిమాండ్లను పరిశీలించి, కార్మికులకు మేలు జరిగేలా ఈ నిర్ణయం తీసుకున్నారు.పాలాభిషేకం కనీస వేతనాలు పెంచినందుకు హర్షం వ్యక్తం చేశారు.సంబరాలు చేస్తూ ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్మిక తెలంగాణలో కనీస వేతనాలు భారీగా పెంచుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ నాయకులు ఈ వేతనాల పెంపుకు సంబంధించిన పూర్తి వివరాలు కనీస వేతనాల పెంచుతూ కార్మికులను నాలుగు కేటగిరీలుగా విభజించి ఈ వేతనాలను సవరించారు. ప్రకటన చాలా కాలంగా ఉన్న డిమాండ్లను పరిశీలించి, కార్మికులకు మేలు జరిగేలా ఈ నిర్ణయం తీసుకున్నారు.పాలాభిషేకం చేశారు.సందర్భం: కనీస వేతనాలు పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు ప్రతినిధులు పాల్గొన్నారు.



Printed, Published, Edited & Owned by **PAMMI YEDUKONDALU**, Published From Door No. 2-2-14, 13th Ward, Komaravaram Road, TANUKU -534 211 West Godavari Dt., A.P.,
Printed at **SRI SATYA OFFSET PRINTERS**, Venkatrama Theater Street, **TADEPALLIGUDEM** - 534 102, West Godavari Dt., A.P. Editor : **PAMMI YEDUKONDALU**